



ప్రజా చైతన్యమే...

# లక్ష్యం

తెలుగు దినపత్రిక




ఎడిటర్ ఇన్ చీఫ్-మధుసూదనరావు చల్లా
Cell : 6302222748, 9492569010

Simultaneously circulated in Amaravathi, Hyderabad, Vijayawada, Nellore, Ongole, Guntur, Krishna, Chittoor, Kadapa & all Districts of Andhra Pradesh & Telangana.

సంపుటి:1 సంచిక:215 శనివారం, 27-9-2025 పేజీలు : 8 వెల: 3/-

LEGAL AFFAIRS
All legal Affairs About Lakshyam Telugu Daily, Should be filled in Guntur Courts Only

# ఏపీలో ఉద్యోగాల జాతర..

**అమరావతి,26 సెప్టెంబరు లక్ష్యం న్యూస్**

రాష్ట్రంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాలపై నేడు శాసనసభలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 15 నెలల కాలంలోనే రాష్ట్రంలోని వివిధ రంగాల్లో మొత్తం 4,71,574 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు వివరించారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మంది ఉపాధ్యాయులను, ప్రభుత్వంలోని ఇతర శాఖల్లో 9,093 మందిని, పోలీస్ విభాగంలో 6,100 మందిని నియమించినట్లు అన్నారు . వీటితో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, జాబ్ మేళాల ద్వారా 92,149 మందికి, వర్క్ ఫ్రం హోం అవకాశాల ద్వారా మరో 5,500 మందికి ఉపాధి లభించిందన్నారు. ప్రైవేట్ రంగంలో పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల ద్వారా అత్యధికంగా 3,48,891 మందికి ఉద్యోగాలు వచ్చాయని అన్నారు . ఎవరు, ఎక్కడ, ఏ రంగంలో ఉద్యోగం పొందారనే పూర్తి వివరాలతో త్వరలోనే ఒక పోర్టల్ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తొలి తరం యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు.మౌలిక వసతుల్లో దూకుడు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనే కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. హైవేల నిర్మాణంలో



దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని, ప్రస్తుతం రాష్ట్రంలో రూ.1.5 లక్షల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని తెలిపారు. స్థానిక అవసరాలు, ట్రాఫిక్ పరిస్థితులను బట్టి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. రైల్వే రంగంలో రాష్ట్రంలో 145 రకాల పనులు పురోగతిలో ఉన్నాయని, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై మధ్య హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్ల ఏర్పాటుపై చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖపట్నం రైల్వే జోన్‌ను ప్రారంభించి, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించామని గుర్తుచేశారు.పోర్టులు, ఎయిర్‌పోర్టులతో ఆర్థిక ప్రగతిలాజిస్టిక్స్ రంగంలో రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులకు అవకాశం ఉందని చంద్రబాబు తెలిపారు. కార్గో రవాణాలో గుజరాత్ తర్వాత మన రాష్ట్రమే ఉందని, కొత్తగా రానున్న నాలుగు పోర్టుల నిర్మాణంతో ఈ సామర్థ్యం మరింత పెరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. పోర్టుల నిర్మాణానికి నిర్దిష్ట లక్ష్యాలు పెట్టుకుని పనిచేస్తున్నామని చెప్పారు. మత్స్యకారుల కోసం ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు నిర్మిస్తున్నామని, జల రవాణా కోసం ఇన్‌లాండ్ మార్గాలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. విమానయాన రంగం గురించి మాట్లాడుతూ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 2026 ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్రంలోని ఇతర ఎయిర్‌పోర్టులలో టెర్మినళ్లు, రన్‌వేలను విస్తరిస్తామని ఆయన సభకు వివరించారు. నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.దసరా ఉత్సవాల విషయంలో విజయవాడ నగరాన్ని దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన కోల్‌కతా, మైసూరు నగరాల సరసన నిలబెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్ర పర్యాటక రంగంలో విజయవాడ దసరా వేడుకలను ఒక ముఖ్యమైన ఆకర్షణగా తీర్చిదిద్దుతామని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి మహిళా యోజన..

**(న్యూఢిల్లీ నుంచి)**

శుక్రవారం నాడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బిహార్ లో ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద ఒక్కో మహిళకు రూ.10,000 చొప్పున రూ.7,500 కోట్ల మొత్తాన్ని వాళ్ల ఖాతాలోని నేరుగా బదిలీ చేశారు. బిహార్ సిఎం నితీష్ కుమార్, ఇతర మంత్రుల సమక్షంలో వర్చువల్ తరహాలో న్యూఢిల్లీ నుంచి మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు.'నవరాత్రి ఉత్సవాల తరుణంలో బిహార్ మహిళల సంతోషంలో భాగస్వామ్యం అవుతున్నా. లక్షలాది మంది మహిళల ఆశీస్సులే మాకు కొండంత బలం. వారికి నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా' అని మోదీ వర్చువల్ మీట్‌లో పేర్కొన్నారు. ఈరోజు ముఖ్యమంత్రి మహిళా యోజన



పథకాన్ని ప్రారంభమిస్తున్నామని, ఈ పథకంలో ఇంతవరకూ 75 లక్షల మంది మహిళలు చేరారని, వీరందరికీ రూ.10,000 చొప్పున వారివారి అకౌంట్లలో జమ చేశామని చెప్పారు.

# నాటో చీఫ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కేంద్రం



**(న్యూఢిల్లీ నుంచి)**

ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య ఫోన్ సంభాషణ జరిగిందంటూ నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే చేసిన వ్యాఖ్యల పై భారతదేశ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఆ వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని, అందులో ఏమాత్రం వాస్తవం లేదని ఖండించింది.న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా, రట్టే ఒక టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలు విధించిందని, ఈ పరిణామంతో ప్రధాని వెంటనే పుతిన్‌కు ఫోన్ చేసి, ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధ ప్రణాళికలను వివరించాలని కోరారని రట్టే పేర్కొన్నారు.ఈ వ్యాఖ్యలపై శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఘాటుగా స్పందించారు. "నాటో చీఫ్ మార్క్ రుట్టే చేసిన ప్రకటనను మేము గమనించాం. అది వాస్తవ విరుద్ధం, పూర్తిగా నిరాధారమైనది. ప్రధాని ఎప్పుడూ పుతిన్‌తో ఆ విధంగా మాట్లాడలేదు. అలాంటి సంభాషణ అసలు జరగనేలేదు" అని ఆయన స్పష్టం చేశారు.నాటో వంటి ముఖ్యమైన, గౌరవనీయమైన సంస్థల నాయకత్వం బహిరంగ ప్రకటనలు చేసేటప్పుడు మరింత బాధ్యతాయుతం, కచ్చితత్వంతో వ్యవహరించాలని తాము ఆశిస్తున్నట్లు జైస్వాల్ తెలిపారు. "ప్రధాని సమావేశాలను తప్పుగా చిత్రీకరించే, జరగని సంభాషణలను సూచించే ఊహాజనిత లేదా నిర్లక్ష్యపూరిత వ్యాఖ్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కావు" అని ఆయన హెచ్చరించారు.భారత్ తన ఇంధన అవసరాల విషయంలో ఎప్పటిలాగే స్వతంత్రంగానే నిర్ణయాలు తీసుకుంటుందని జైస్వాల్ పునరుద్ఘాటించారు. "భారత ప్రజలకు సరసమైన ధరలకు ఇంధనాన్ని అందించడమే మా ప్రథమ ప్రాధాన్యత. మా జాతీయ ప్రయోజనాలను, ఆర్థిక భద్రతను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటాం" అని ఆయన వివరించారు. రష్యాతో వ్యాపారం చేస్తున్న దేశాలపై కఠిన ఆర్థిక ఆంక్షలు విధిస్తామని మార్క్ రుట్టే గతంలోనూ భారత్‌ను హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే, ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించవద్దని అప్పుడే భారత్ గట్టిగా బదులిచ్చింది.

# కూటమి ప్రభుత్వంలో సాంఘిక సంక్షేమ శాఖలో విప్లవాత్మక మార్పులు


**- రూ.143 కోట్లతో సంక్షేమ వసతి గృహాలకు మరమ్మత్తులు**
**- రూ.104 కోట్లతో నూతన హాస్టళ్ల నిర్మాణం**
**- మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి**

**అమరావతి,26 సెప్టెంబరు లక్ష్యం న్యూస్** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాంఘిక సంక్షేమశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం నాడు శాసనసభలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. ఈ సంధర్భంగా మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.... విశాఖ జిల్లా పెందుర్తిలో బాలికల కాలేజీ వసతి గృహ నిర్మాణం కోసం రూ.3 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు.పెందుర్తిలోని బాలికల వసతి గృహానికి రూ. 8.65 లక్షలతో, బాలుర కాలేజీ వసతి గృహానికి రూ. 13.20 లక్షలతో మరమ్మతులు చేశామని మంత్రి తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 143 కోట్లతో రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో మరమ్మతులు చేశామన్నారు. టాయిలెట్ల నిర్మాణానికి ప్రత్యేకంగా రూ. 23 కోట్లు కేటాయించామన్నారు. మరో రూ. 104 కోట్లతో నూతన హాస్టళ్లు నిర్మిస్తున్నామని మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

# అమరావతిలో ఇండియా ఇంటర్నేషనల్ లీగల్ యూనివర్సిటీ..

**అమరావతి,26 సెప్టెంబరు లక్ష్యం న్యూస్**

ఎపి ఉన్నత విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన ముందడుగు వేసింది. రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక 'ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' ఏర్పాటుకు శాసనసభ ఆమోదం . వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. అదే సమయంలో, రాష్ట్రానికి మరిన్ని ప్రైవేటు



విశ్వవిద్యాలయాలను ఆకర్షించేందుకు వీలుగా నిబంధనలను సరళీకరిస్తూ ప్రవేశపెట్టిన సవరణ బిల్లు కూడా ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. శుక్రవారం శాసనసభలో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ 2 కీలక బిల్లులను ప్రవేశపెట్టారు.

**అమరావతి కేంద్రంగా న్యాయ విద్య, పరిశోధనలు**

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఆంధ్రప్రదేశ్‌కు IIULER ను మంజూరు చేయించారు. ఇందుకు శాసనసభ తరఫున ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం" అని అన్నారు. ఈ విశ్వవిద్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి 55 ఎకరాల భూమిని చదరపు మీటర్‌కు రూపాయి నామమాత్రపు లీజుపై కేటాయించామని వివరించారు. ఈ విశ్వవిద్యాలయం కేవలం న్యాయ విద్యకే పరిమితం కాకుండా, పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత స్థాయి పరిశోధనలకు ఒక ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు.

# కెనడాలో ఐ.సి.ఏ.ఓ సభలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.

**(న్యూఢిల్లీ నుంచి)**

కెనడా దేశం, మాంట్రియాడ్ లో జరుగుతున్న 42వ ఐసిఎఓ (ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్) సాధారణ సభలో భారత దేశ ప్రతినిధిగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసిఎఓ కౌన్సిల్ అధ్యక్షుడు సాల్వటోర్ షియాక్చిటానో, కార్యదర్శి జనరల్ జువాన్ కార్లోస్ సలాజార్ లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సభలో పాల్గొనడం తనకు లభించిన అరుదైన గౌరవంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భారత విమానయాన రంగం సాధిస్తున్న విశేషమైన వృద్ధిని ప్రస్తావించారు. ఐసిఎఓ ఎల్లప్పుడూ అందిస్తున్న సహాయసహకారాలకు కృతజ్ఞతలు తెలుపారు. గ్లోబల్ ఏవియేషన్‌లో భారతదేశం చూపబోయే భవిష్యత్ విప్లవాన్ని, ఐసిఎఓ కౌన్సిల్‌తో పాటు సభ్యదేశాలతో పంచుకోబోయే టెక్నికల్ నైపుణ్యం మరియు స్కిల్లింగ్ అనుభవం వంటి అంశాలపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చర్చించారు. ఈ సందర్భంగా ఐసిఎఓ స్వీకరించిన తాజా నినాదం No Country Left Behind అనే అంశం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆలోచన "వసుధైవ కుటుంబకం" అన్న మానవతా స్ఫూర్తిని



ప్రతిబింబిస్తుందని రామ్మోహన్ స్పష్టం చేశారు. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ ఇచ్చిన ఈ ఆదేశానికి భారత్ సంపూర్ణంగా కట్టుబడి ఉందనీ తెలిపారు. అదేవిధంగా, సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ వినియోగంపై భారత్ తీసుకుంటున్న దృఢమైన చర్యలను, అలాగే విమానయాన రంగంలో మరింత మంది మహిళలు పాల్గొనేలా లింగ సమానత్వంతో కూడిన మార్పుల గురించి కూడా ఐసిఎఓ సమావేశంలో రామ్మోహన్ నాయుడు వివరించారు. ఈ సందర్భంగా భారత విమానయాన రంగంలో సాధించిన వృద్ధికి ప్రతిగా ఆర్గనైజేషన్ ప్రతినిధులు రామ్మోహన్ నాయుడు కు అభినందనలు తెలిపారు.

# జిఎస్టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి:సిఎస్ విజయానంద్

**అమరావతి,26 సెప్టెంబరు:లక్ష్యం న్యూస్**

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తుసేవల పన్ను తగ్గింపు జిఎస్టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు నెల రోజుల పాటు ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలక్టర్లను ఆదేశించారు.సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ పై నెల రోజుల సెలబ్రేషన్స్ కార్యక్రమం,సీజనల్ కండిషన్స్,పిఎం సూర్యఘర్,కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు, సోలార్,విండ్ ప్రాజెక్టులకు భూ సంబంధిత అంశాలపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ జూన్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్టే ఈనెల 22 నుండి అమలులోకి వచ్చిన జిఎస్టి 2.0 ప్రయోజనాలపై



ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు దసరా నుండి దీపావళి వరకు నెలరోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ప్రచార అవగాహనా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈకార్యక్రమాన్ని ఏవిధంగా నిర్వహించాలనే దానిపై ఇప్పటికే జిఓను జారీ చేశామని ఆప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కలక్టర్లను ఆయన ఆదేశించారు.జిఎస్టి 2.0 వల్ల రాష్ట్రానికి సుమారు 8 వేల కోట్ల రూ.లు ఆదాయం తగ్గుతున్నప్పటికీ ప్రతి కుటుంబానికి 10 నుండి 15 శాతం సొమ్ము ఆదా అవుతున్న నేపధ్యంలో ప్రభుత్వం జిఎస్టి 2.0ను స్వాగతించడం జరిగిందన్నారు.జిఎస్టి తగ్గింపు వల్ల ఏవిధంగా లబ్ది కలుగుతుందనే దానిపై ప్రజలకు విస్తృతంగా తెలియజేసి వారిలో పూర్తి అవగాహన కల్పించేందుకు నెలరోజుల కార్యక్రమాన్ని అనగా అక్టోబరు 19వ తేదీ వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సిఎస్ తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలు,పట్టణాలు, మండల,అసెంబ్లీ నియోజకవర్గ,జిల్లా కేంద్రాల్లో అవగాహనా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర చీఫ్ కమీషనర్ ఆఫ్ స్టేట్ టాక్సెస్ బాబు ఎ మాట్లాడుతూ

2లో

# 'బాలకృష్ణకు ఎందుకంత అహంభావం?'

**అమరావతి,26 సెప్టెంబరు లక్ష్యం న్యూస్**



మండలి చైర్మన్ సీటులో దళితుడు కూర్చున్నాడని అవమానించాలని ప్రభుత్వ పెద్దలు చూస్తున్నారని వైయస్ఆర్‌సీపీ నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికీ ప్రతిపాదించిన హక్కులు అందించాలన్నారు బొత్స. శాసనమండలి వాయిదా పడిన అనంతరం మీడియా పాయింట్ వద్ద బొత్స మాట్లాడారు. అసెంబ్లీలో బాలకృష్ణ వ్యాఖ్యలు వినడానికి సిగ్గుపడుతున్నామని, చట్ట సభల్లో ఇలా జరగడం దురదృష్టకరమన్నారు. 'బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు మొత్తం రికార్డుల్లో ఉంది. ఆయన మామూలుగా ఉన్నాడా?, ఒక మాజీ సీఎంని, చిత్ర పరిశ్రమలో ముఖ్య హీరోని అవమానించడం సరికాదు. సభలో లోకేష్ మమ్మల్ని ఎవరేం పీకుతారు అన్నారు వాళ్ళ వ్యవహారశైలి అలాగే ఉంది. మాజీ ముఖ్యమంత్రి అన్నా గౌరవం లేదు. సినీ పరిశ్రమకు చెందిన మాజీ కేంద్ర మంత్రి అన్న గౌరవం లేదు.

# ఇది మెగా డియస్సీ కాదు, దగా డియస్సీ

**మచిలీపట్నం: 26 సెప్టెంబరు లక్ష్యం న్యూస్**



అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా మెగా డియస్సీ నిర్వహించి నియామక పత్రాలిస్తామని హామీ ఇచ్చి.. నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం నిలువుగా మోసం చేసిందని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) మండిపడ్డారు. మచిలీపట్నం వైయస్ఆర్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... 25 వేల ఉపాధ్యాయపోస్టుల భర్తీ చేస్తానని నమ్మించిన చంద్రబాబు ప్రభుత్వం.. కేవలం 15,941 పోస్టులు మాత్రమే భర్తీ చేయడాన్ని తప్పు పట్టారు. ఇది కచ్చితంగా నిరుద్యోగులను మోసం చేయడమేనని తేల్చి చెప్పారు. మరోవైపు శాసనసభలో ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, బాలకృష్ణలు మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్ పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

2లో

# త్వరలో ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్ ప్రారంభం

**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**
**- వంద మంది బీసీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్**
**- ఏటా డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం**
**- డీఎస్సీకి కూడా ఉచిత కోచింగ్ అందజేస్తాం : మంత్రి సవిత**
**- మంత్రి సవితను సత్కరించిన స్టడీ సర్కిల్ ఉద్యోగులు**

**అమరావతి :26 సెప్టెంబరు లక్ష్యం న్యూస్**

బీసీ స్టడీ సర్కిల్ ద్వారా త్వరలో సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ప్రారంభించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. శుక్రవారం అమరావతిలోని రాష్ట్ర



సచివాలయం నాలుగో బ్లాక్ లో మంత్రి సవితను ఏపీ బీసీ స్టడీ సర్కిల్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. బీసీ సంక్షేమ శాఖకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు వచ్చినందుకు గానూ మంత్రిని వారు సత్కరించారు.

# బస్సులు నిలబెట్టకపోవడంతో ఇబ్బంది పడుతున్న ఆసుపత్రికి వచ్చిన ప్రజలు



**గిద్దలూరు సెప్టెంబర్ 26 (లక్ష్యం న్యూస్)**
ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణంలోని పెద్ద ఆసుపత్రి కి పోరుమామిళ్ల, కలసపాడు కాశిరెడ్డి నాయన మండల,ప్రాంతం నుండి వచ్చిన ప్రజలు ఆసుపత్రిలో చూపించుకొని తిరిగి వెళుతున్న సమయంలో ఆర్టిసి బస్సులు నిలబెట్టకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు పైగా పేషెంట్స్ చాలా సేపు నిలబడాలంటే నిలబడలేక ప్రస్తుతం ఈరోజు వాన కూడా కురుస్తుంది చాలా ఇబ్బంది పడుతున్నారు ప్రజలు. నేనే స్వయంగా బస్సులను చూశాను 12 గంటల 8 నిమిషాలకు గిద్దలూరు డిపో బస్సు 12 గంటల14 నిమిషాలకు మైదుకూరు బస్సు వచ్చినా ఖాళీగా ఉన్న నిలబెట్టలేదు.

# భక్త రంజికంగా నగరంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**గుంటూరు సెప్టెంబర్ 26 లక్ష్యం ప్రతినిది**



నగరంలో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి .పలుచోట్ల వివిధ అలంకరణలో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం శ్రీ మహాలక్ష్మి అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. అభిషేకాలు నిర్వహించారు. అర్చనలు జరిపారు. కుంకుమార్చన పూజలు సాగించారు. నగరంలోని ఆరు అగ్రహారం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ,చైత్ర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం గార్డెన్స్ శ్రీవారి ఆలయం ,ఎస్వీఎన్ కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, సంపత్ నగర్ శ్రీ శారదా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, చుట్టగుంట శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం తో పాటు పలు దేవస్థానాల్లో అమ్మవారికి విశేష పూజలు సాగిస్తున్నారు గురువారం అలంకరణలో ఉన్న దీదీప్యమానమైన కాంతులతోవెలుగొందుతున్న అమ్మవారినీ వీక్షించి తరించారు .సకల కష్టాలు తొలగిపోవాలని లోక కళ్యాణం జరగాలని ఆకర్షించారు

# ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలి




**గుంటూరు సెప్టెంబర్ 26 లక్ష్యం ప్రతినిది**
రాష్ట్రవ్యాప్తంగా బకాయి ఉన్న నాలుగువేల 2500 కోట్ల ఫీజు రీఎంబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలని ఏ బి వి పి రాష్ట్ర నేతలు వేదశ్రీ, పవన్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం లాడ్జి సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు .ఈ సందర్భంగా వేదశ్రీ ,పవన్ కుమార్ మాట్లాడారు. గతంలో కూటమి నాయకులు సీజు రీయింబర్స్మెంట్లను వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. అయితే నేటికీ బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలలో విద్యార్థులకు ఒత్తిళ్లు ఎరిగాయి అన్నారు. ఫీజుల కోసం యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నయని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల సర్టిఫికెట్లు సైతం ఇవ్వకుండా యాజమాన్యం వేధిస్తుందన్నారు. ఈప్పటికైనా విద్యామంత్రులు లోకేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకొని బకాయి ఫీజులను, స్కాలర్షిప్పులను విడుదల చేయాలన్నారు. నిరాకరిస్తే ఆందోళన తప్పదని వేదశ్రీ, పవన్ కుమార్ హెచ్చరించారు.

# అన్న క్యాంటీన్లలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**చిలకలూరిపేట సెప్టెంబర్ 26 లక్ష్యం న్యూస్**
అన్న క్యాంటీన్లలో అందిస్తున్న టిఫిన్, భోజనం నాణ్యతను పరిశీలించేందుకు మున్సిపల్ ఛైర్మన్ రఫాని, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబు పట్టణంలోని అన్న క్యాంటీన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రఫాని, కమిషనర్ శ్రీహరి బాబు అన్న క్యాంటీన్లలో ఆహారం స్వీకరిస్తున్న స్థానికులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. వారికి నాణ్యమైన టిఫిన్, భోజనం అందుతున్నాయా, లేదా అనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం కమిషనర్ శ్రీహరి బాబు మాట్లాడుతూ, అన్న క్యాంటీన్లలో పనిచేసే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా, వినియోగదారులకు నాణ్యత కలిగిన భోజనాన్ని అందించాలని, అలాగే క్యాంటీన్‌లలో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా, అన్న క్యాంటీన్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడా కూడా మురుగునీరు నిలబడకుండా పారిశుధ్య కార్మికులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడరాదని ఈ సందర్భంగా ఛైర్మన్ షేక్ రఫాని కమిషనర్ పి శ్రీహరిబాబు స్పష్టం చేశారు.

# మహాయోగిని మాతృ శ్రీ సూరమ్మ అమ్మగారి ఆరాధన కార్యక్రమం

**చెరుకుపల్లి( లక్ష్యం న్యూస్) సెప్టెంబర్ 26: –**



మాతృశ్రీ సూరమ్మ తల్లి గూడవల్లి లో శివకేశవాలయాలను నిర్మించి అమ్మ ప్రజల గుండెల్లో ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు ఈరోజు మన మధ్య లేకపోయినా అమ్మ ఆరాధన కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం జరిపించడం గర్వకారణ అని వీరంకి బుల్లయ్య మాస్టారు కొని ఆడారు అమ్మ ఆరాధనకు ప్రత్యేక ఏర్పాట్లు ప్రసాదాలను, అహ్లాదకరమైన కార్యక్రమం కోలాటం ను ఏర్పాటు చేసి మహాయోగినిమాతృశ్రీ సూరమ్మ అమ్మగారిని స్మరించుకున్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఏఎంసీ డైరెక్టర్ వీరంకి సాంబశివరావు వైస్ సర్పంచ్ పాగోలు కోటేశ్వరరావు వీరంకి వెంకట శివ రాయన రాంబాబు వీరంకి రామకోటేశ్వరరావు ఉయ్యూరు సుబ్బారావు శొంఠి వరప్రసాద్ తాత శ్రీరాములు కమిటీ వారు గ్రామ ప్రజలు మాతృశ్రీ స్వరము తల్లి భక్తులు తదితరులు పాల్గొన్నారు – ఓం శ్రీమాత్రే నమః

# ఉప కులాలన్నిటిని గౌడ కులం గానే ప్రభుత్వంఅధికారికంగా గుర్తించాలి

**గుంటూరు సెప్టెంబర్ 26 లక్ష్యం ప్రతినిది**
ఉప కులాలైన గౌన్డియా గమల్ల, కలేలి తదితర కులాలన్నిటినీ కూడా గౌడ కులంగానే ప్రభుత్వం అధికారికంగా గుర్తించాలని గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మురళి గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారంఇన్నర్ రింగ్ రోడ్ లోని మాధవి హైట్స్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంఘం నేతలు ఏడుకొండలు తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తమ గౌడ కులంలోని గౌండియా, గమల్ల, కలేలి వంటి కులాలను తెగలగా ప్రభుత్వం గుర్తించవద్దని సూచించారు. ఈ మొత్తం ఉప కులాలను ఒకే ఒక గౌడ కులంగా ప్రభుత్వం గుర్తించాలన్నారు. అధికారికంగా గుర్తిస్తే కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర సంక్షేమ పథకాలు నూటికి నూరు శాతం తాము పొందడం సాధ్యమవుతుందన్నారు. ఇటీవల జరిగిన మద్యం దుకాణాల వేలం పాటలోఉపకులాల పేరును అధికారులు సాకుగా చూపి గౌడ కులానికి అన్యాయం చేశారన్నారు.



దాంతో సుమారు రాష్ట్రవ్యాప్తంగా 150 షాపుల దాకా గౌడ వర్గీయులు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రత్యేక జీవో స్పష్టంగా జారీచేసి ఉపక్కొలాలన్నిటిని గౌడ కులంగానే పరిగణించాలని మురళి కోరారు .అలాగే ఉప కులాలైన గౌండియా, గమల్ల, కలేలి వంటి కులాలను ఏక కులంగా గుర్తించి ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేయాలని కోరారు. అలాగే రాబోయే జనాభా లెక్కల సేకరణ మరియు కుల గణనాలలో గౌడ ఉపకులాలన్నిటినీ కలిపి గౌడగానే పరిగణలోకి తీసుకొవాలనిమురళి గౌడ్ కోరారు.

# గత ప్రభుత్వంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్లో జరిగిన అవినీతి, అక్రమాలపై నిగ్గు తేల్చండి : ప్రత్తిపాటి

- వాహనాల కొనుగోళ్లు.. బయో మైనింగ్ పనుల ఎంపిక, వ్యర్థాల నిర్వహణలో జరిగిన అక్రమాలపై కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి : ప్రత్తిపాటి.
- జ్ఞానేశ్వరి ఫౌండేషన్ పనులు చేయకుండానే ప్రజలసొమ్ము దిగమింగిన వైనం ప్రజలకు తెలియాలి: ప్రత్తిపాటి
- శాసనసభ ద్వారా పిటిషన్ రూపంలో ప్రభుత్వానికి మాజీమంత్రి ప్రత్తిపాటి విజ్ఞప్తి.



**చిలకలూరిపేట సెప్టెంబర్26(లక్ష్యంన్యూస్)**
2019–24 మధ్య కాలంలో రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ లో జరిగిన అక్రమాలు, అవినీతిపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరపాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం సభలో పిటిషన్ అందించారు. జగన్ హాయాంలో జరిగిన అవినీతిలో ఇది కేవలం ఆవగింజంత మాత్రమేనని ప్రత్తిపాటి చెప్పారు. ఆనాడు ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పరిధిలో జరిగిన పలు అవకతవకలు, అవినీతి టెండర్ల వ్యవహారాన్ని ప్రత్తిపాటి సభ దృష్టికి తీసుకెళ్లారు. నాసిరకం డస్ట్ బిన్ల కొనుగోలు, ట్రై సైకిళ్లు, ఈ–ఆటోల కొనుగోళ్లు, లెగసీ వ్యర్థాలు, బయో రెమిడేషన్, బయో మైనింగ్ పనులు ఎంపిక, నిర్వహణలో జరిగిన అక్రమాలు.. అవినీతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి దోషుల్ని కఠినంగా శిక్షించాలని ప్రత్తిపాటి సభద్వారా ప్రభుత్వాన్ని కోరారు. అలానే చిలకలూరిపేటకు చెందిన జ్ఞానేశ్వరి ఫౌండేషన్ సంస్థ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పరిధిలో చేసిన దోపిడీపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని, పనులు చేయకుండానే చేసినట్టుగా రికార్డులు సృష్టించి సదరు సంస్థ ప్రజల సొమ్ము దిగమింగిన వైనం రాష్ట్ర ప్రజలకు తెలియాల్సిన అవసరముందని ప్రత్తిపాటి అసెంబ్లీలోఅన్నారు.

# జీఎస్టీ సవరణలతో పేద మధ్యతరగతి వర్గాలకు మేలు.. తాటిపర్తి జయరామిరెడ్డి.

## సేవ పక్వాడ్ పక్షోత్సవాలలో భాగంగా గణపురం గ్రామంలో స్వచ్ఛభారత్

**చిలకలూరిపేట సెప్టెంబర్ 26 లక్ష్యంన్యూస్**
రాష్ట్ర అధ్యక్షులుపివిఎన్ మాధవ్ సూచనలతో నరేంద్ర మోడీపుట్టినరోజు సందర్భంగా నిర్వహిస్తున్న సేవ పక్వాడ్ పక్షోత్సవాలలో భాగంగా మండలం లోని గణపవరం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. సేవా పక్వాడ్ ఇంచార్జ్, నియోజకవర్గ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డిమాట్లాడుతూ 28 శాతముగా ఉన్న పన్నులను 18 శాతం గా, 18 శాతం గా ఉన్న పనులను ఐదు శాతం గా కుటమి ప్రభుత్వం చేసిన జీఎస్టీ సవరణలతో పేద మధ్యతరగతి వర్గాలకు మేలుజరుగుతుంది అని అన్నారు. అదేవిధంగా విదేశీ వస్తువులు విడనాడి, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించి, స్వదేశీ వస్తు ఉత్పత్తులు ప్రోత్సహించినట్లయితే , దేశ ఆర్థిక స్వావలంబనకు భాగస్వాములవ్వాలనిఅన్నారు. మన దేశంలో మన పరిశ్రమలు ఎంతో అభివృద్ధి చెంది, మనకు ఎంతో మేలు జరుగుతుందని తెలియజేశారు. అలాగే గణపవరం గ్రామంలో “ స్వచ్ఛభారత్ “ చేస్తూ మన పరిసరాలు శుభ్రంగా ఉంటే, సీజనల్ వ్యాధులు రాకుండా అరికట్టి, మన ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకునే విధముగా కార్యక్రమం చేపట్టడం జరిగినదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం గురుస్వామి, పట్టణ ఉపాధ్యక్షులు దండ వెంకట శ్రీనివాస్ కుమార్,పట్టణమాజీ అధ్యక్షులు పొత్తూరి బ్రహ్మానందం, నాదెండ్ల మండల మాజీ అధ్యక్షులు ఆల శివకోటి రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాతాని రామకృష్ణయ్య,ఎస్సీ మోర్చా స్టేట్



ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగండ్ల వీరయ్య, సీనియర్ నాయకులు నల్లబోతు రంగారావు, లాజర్, చిన కొండయ్య, రమావత్ నాయక్, శ్రీను వర్మ, రామాంజనేయులు, రమణి, ఎస్తేరమ్మ, రాజు, వెంకటచారి, నాయకులు, కార్యకర్తలు అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.

# అంబరానంటిన శ్రీ సీతారామాంజనేయ భజన బృందం సంబరాలు

**చిలకలూరిపేట సెప్టెంబర్ 26 లక్ష్యం న్యూస్**
హిందువులకు అత్యంత ముఖ్యమైన పండుగ విజయదశమి. దీన్ని దేశవ్యాప్తంగా ప్రజలందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. ఈ పండుగ ముఖ్యముగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. నవరాత్రులుగా పిలవబడే ఈ తొమ్మిది పర్వదినాల్లో అమ్మవారిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఈ తొమ్మిది రోజులు అమ్మవార్లను శైలపుత్రి, బాల త్రిపుర సుందరి దేవి, గాయత్రి దేవి, లలితా దేవి, సరస్వతి దేవి, అన్నపూర్ణాదేవి, మహాలక్ష్మి, దుర్గాదేవి, మహిషాసుర మర్దిని గా ఈ తొమ్మిది రోజులు అమ్మవారిని 9 అవతారాల్లో అలంకరించి పదవరోజు రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారిని ప్రత్యేకముగా అలంకరించి అమ్మవారి కరుణాకటాక్షాలు పొందుతారు. అంతటి ప్రాముఖ్యత కలిగి శరన్నవరాత్రులతో కూడిన ఈ దసరా పండుగను పురస్కరించుకొని శాశ్వత దేవాలయ ధర్మకర్తలు అయినటువంటి చెన్నూరిఏడుకొండలు, చెన్నూరిపెద బ్రహ్మేశ్వర రావు, కార్యనిర్వాహక సభ్యులు చెన్నూరిచిన్న బ్రహ్మేశ్వర రావు, తుపాకులహరికృష్ణ లచే ఎంతో ప్రతిష్టాత్మకంగా పట్టణంలోని 14వ వార్డు దాసరి కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ, నాగేంద్ర స్వామి దేవస్థానము నందు గురువారం సాయంత్రం నియోజకవర్గంలోని నాదెండ్ల




మండలం,నాదెండ్ల గ్రామనికి చెందిన శ్రీ సీతారామాంజనేయ భక్త బృందం వారిచే ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సంబరాలు అంబరానంటాయి. దసీతారామాంజనేయ భజన బృందం గత పది సంవత్సరాల నుంచిప్రజలందరూ కన్నుల పండుగగా శ్రీ సీతారామాంజనేయ భజన బృందం కార్యక్రమాలు ఏర్పాటు చేసిన ప్రతి చోట ప్రజల ఆదరభిమానాలను పొందుతూ శ్రీ సీతారామాంజనేయ భజన బృందం అత్యంత పవిత్రంగా ఎంతో భక్తిశ్రద్ధలతో పలు ప్రాంతాలలో పలుచోట్ల భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతిచోట ప్రజల మనసులను వారి కార్యక్రమాలతోటి ప్రజలకి వారి భజన బృందానికి విడదీయరాని బంధాన్ని ఏర్పరచుకుంటున్నారు. ముఖ్యముగా ఈ భజన కార్యక్రమంలో ప్రముఖ గాయకులు వేములపల్లిశ్రీరంగం, గంగవరపుఅవినాష్, చెవులవెంకటేశ్వర్లు, చెవుల వీరాంజనేయులచే ప్రత్యేకముగా భక్తి పాటలతో ప్రజలను ఆ సంబరాల నుంచి అడుగు పక్కకు పడనీయకుండా ఎంతో మధురాతి మధురంగా ప్రతి ఒక్కరి మనసుకు హత్తుకునేలా పాటలను శంఖంలో పోసిన తీర్థం వలె తియ్యగా ఆలపించి వారి మనసులను వారి స్వరంతో కొల్లగొట్టారు. ప్రజలందరూ దాసరి కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ మరియు నాగేంద్ర స్వామి వారి దేవస్థానములకు తండోపతండాలుగా విచ్చేసి శ్రీ సీతారామాంజనేయ భజన బృందం నిర్వహించిన కార్యక్రమాలను కనులు విందుగా వీక్షించి ఆ ముల్లోకాలను పాలించే శ్రీ కనకదుర్గమ్మ, నాగేంద్ర స్వామి వార్ల ఆశీస్సులను ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరూ ఆ అమ్మవారి లను భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

# ప్రజా ఆరోగ్య రక్షణ చర్యల్లో అలసత్వం తగదు కేంద్రమంత్రి పెమ్మసాని




**గుంటూరు సెప్టెంబర్ 26 లక్ష్యం ప్రతినిధి**
జిల్లా వ్యాప్తంగా పెరిగిపోతున్న డయేరియా, కలరా వంటి అంటూ వ్యాధులను నియంత్రించేందుకు ప్రత్యక్ష, పటిష్ట చర్యలను తీసుకోవాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర రావు ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ఆన్సరి య, నగర కమిషనర్ శ్రీనివాసులు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ప్రభలుతున్న అంటువ్యాధుల పట్ల తీసుకున్న నియంత్రణ చర్యల పట్ల సమీక్షించారు. ముఖ్యంగా నగరంలో కలరా, డయోరియా అదుపుకు అధికారులంతా సమన్వయంగా కృషి చేయాలని అన్నారు. మంచినీటి పైపులై వ్యవస్థలోని లోపాలను పరిశీలించి సరిదిద్దాలన్నారు. రోడ్లపై అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలన్నారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడారు. జిల్లాలో, నగరంలో అంటువ్యాధుల నియంత్రణకు ప్రత్యక్ష కార్యాచరణకు శ్రీకారం చుట్టామన్నారు. అందులో భాగంగా రోడ్ల వెంబడి పానీ పూరి, అల్పాహార బండ్లు, అనుమతులు లేని మంచినీటి ఆర్వో ప్లాంట్లను నిలిపివేశామన్నారు. సురక్షిత మంచినీరు, పరిశుభ్రమైన వాతావరణం సమకూర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు .నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన అధికారులను, సిబ్బందిని గుర్తించి చర్యలు తీసుకుంటామని నగరంలో అధికార యంత్రాంగం సజావుగానే పనిచేస్తుందని చంద్రశేఖర్ కితాబుఇచ్చారు .

# ఓపెన్ కాని డిజిటల్ బుక్ ఓపెన్ చేయడం జగన్ గొప్పదనం

## –డిజిటల్ బుక్ ఒక ఫార్స్ వ్యవహారం.. నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం

**చిలకలూరిపేట సెప్టెంబర్26(లక్ష్యంన్యూస్)**
ఒక్క వైస్సార్సీపీ కార్యకర్త అయినా డిజిటల్ బుక్ తెరచి పిర్యాదు చేశారా? అసలు ఓపెన్ కాని డిజిటల్ బుక్ జగన్ ఎలా ఓపెన్ చేసారని నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం ఎద్దెవా చేశారు. రెడ్ బుక్ వచ్చింది మీరు చేసిన గూండాయిజం, రౌడీ ఇజం వల్ల అని మరచిపోయి డిజిటల్ బుక్ అనే ఫార్స్ బుక్ తెరమీదకు తేవడం జగన్ చేతగాని తనాన్ని బయట పెట్టిందని రావు సుబ్రహ్మణ్యం అన్నారు. పేలని దీపావళి టపాసులు మాదిరిగా డిజిటల్ బుక్ మిగిలిపోతుందని అన్నారు. నవతరం పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఈమేరకు ఓపెన్ కాని డిజిటల్ బుక్ యాప్ పేజీని కూడా స్క్రీన్ షాట్ తో మీడియా కు విడుదల చేశారు.






# పినపాడునందు ఫ్రైడే డ్రైడే ర్యాలీని ప్రారంభించిన కౌన్సిలర్ షేక్ ఇస్మాయిల్




**తెనాలి సెప్టెంబర్ 26(లక్ష్యంన్యూస్)**
తెనాలిపట్టణమారిస్ పేటలోని పినపాడునందు ఫ్రైడేడ్రైడేకార్యక్రమంలో భాగంగామలేరియాశాఖ ఆధ్వర్యంలో ఇంటింటిని సందర్శించి దోమల లార్వాలు పెరుగుటకు అవకాశం ఉన్న మూలాలను తొలగించి అనంతరం అవగాహన ర్యాలీని 26 వార్డు కౌన్సిలర్ షేక్ ఇస్మాయిల్ ప్రారంభించారు. పినపాడు వైద్యాధికారి డాక్టర్ పరిశపోగు హనోక్ బాబు నందులపేట వైద్యాధికారిణిడాక్టర్ వేముల ప్రియాంక సంయుక్తంగా మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని వాటి వలన దోమలు పెరిగి జ్వరాలు వచ్చే అవకాశం ఉందని తెలియజేస్తూ ఎవరికైనా జ్వరము అని అనుమానం ఉన్నచో వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు వచ్చి రక్త పరీక్ష చేయించుకొని,ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు. సహాయమలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ నీటి నిలువ లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవగాహనతోనే దోమల నిర్మూలన సాధ్యమని ప్రజలు ఎక్కడ నీటిని నిలవలు లేకుండా చూసుకోవడం ద్వారా దోమల యొక్క ఉత్పత్తి తగ్గి వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. తెనాలి పట్టణ సబ్ యూనిట్అధికారిశ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ప్రజలు ఇంటి లోపల ఇంటి బయట నీటి నిల్వలు లేకుండా చూసుకొనవలెనని ముఖ్యంగా ఇంటి లోపల ఉండే కూలర్లు ఫ్రిజ్లు మరియు రుబ్బురోలల్లో వర్షపు నీరు గాని లేక ఇతర నీటి నిల్వలు వల్ల కానీ దోమల సంఖ్య వృద్ధి చెందుతాయని తెలిపారు. చెక్ క్లీన్ అండ్ కవర్ విధానాల ద్వారా నీటిని నిలవలను పరిశీలించుకొని శు భ్రపరచుకొని వాటిపై మూతలు పెట్టుకొనడం ద్వారా దోమలు గుడ్లు పెడతానికి అవకాశం కలగదని తెలిపారు. ఈకార్యక్రమంలో సిడిపిఓ పూడివిజయగౌరీ, డిపిఎమ్ఓ జంగం శ్యామ్,ఆరోగ్య విస్తరణాధికారిఅందెబాలచంద్రమౌళి, గ్రామీణ మలేరియా సబ్ యూనిట్ అధికారి వంగలపున్నారెడ్డి, ఫైలేరియాఎస్.హెచ్ఐ జి. రవికుమార్, మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు దీపాలశ్రీనివాసరావు,తిరువీధుల శివరామప్రసాద్,ఆరోగ్య కార్యకర్తలుషేక్ రషీద్,సయ్యద్ కరీముల్లా, మున్నంగి రత్నాకరరావు, శానిటరీ సూపర్వైజర్ మైలా అప్పారావు, షేక్ బాషీద్,మహిళాఆరోగ్య కార్యకర్త తురుమెళ్ళనిర్మల, శ్రీదేవి,ఆశాకార్యకర్త బూరెలహేమలత, మాధవి, పి.శ్యామల, అంగన్వాడీ కార్యకర్తలు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# చెస్‌ను ప్రపంచానికి పరిచయం చేసింది మనమే



గ్రాండ్ మాస్టర్ ఎంఆర్ లలిత్‌బాబుతో గేమ్ ఆడుతున్న రూరల్ డెవలప్‌మెంట్ మరియు కమ్యూనికేషన్ కేంద్ర సహాయ మంత్రి వర్యులు డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్

**చేబ్రోలు సెప్టెంబర్ 26( లక్ష్యం న్యూస్ )::**
రూరల్ డెవలప్‌మెంట్ మరియు కమ్యూనికేషన్ కేంద్ర సహాయ మంత్రి వర్యులు డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా కొనసాగుతున్న 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు చెస్ ఆట వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, నిర్ణయ సామర్థ్యాలను పెంపొందిస్తుంది. ఇది వినయాన్ని, ఓటమిలో గౌరవాన్ని నేర్పుతుంది. ఈ ఆటను ప్రపంచానికి పరిచయం చేసింది మన దేశమేనని రూరల్ డెవలప్‌మెంట్ మరియు కమ్యూనికేషన్ కేంద్ర సహాయ మంత్రి వర్యులు డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో "62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు" ఘనంగా జరుగుతున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ డెవలప్‌మెంట్ మరియు కమ్యూనికేషన్ కేంద్ర సహాయ మంత్రి వర్యులు డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ ముందుగా గ్రాండ్ మాస్టర్ ఎంఆర్ లలిత్‌బాబుతో ఒక ఎత్తు వేసి ఆటను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఈ ఆటను ఆడుతున్నారని తెలిపారు. మహాభారతం కాలం నుండి నేటి వరకూ భారతదేశానికి చెస్ క్రీడలో గొప్ప మేధో సంపద, చారిత్రక వారసత్వం ఉన్నదిన్నారు. చెస్ ఆటకు ఆవిర్భావం జరిగిన దేశం కూడా భారత్ అనే విషయం అందరికీ తెలిసిందేనని, గుప్త వంశం కాలంలో చెస్ ఆవిష్కరించబడిందన్నారు. మన గౌరవనీయ ప్రధానమంత్రి గారు, రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఇద్దరూ అత్యంత ప్రగతిశీల దృష్టితో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 10%-%15 సంవత్సరాల క్రితం వరకు క్రీడలకు అంత ప్రాముఖ్యత ఇవ్వకపోయినా, ఇప్పుడు 2047 విశ్వగురు భారత్ లక్ష్యంగా, భారతదేశాన్ని ప్రతి క్రీడలో అగ్రగామి చేయడానికి అనేక పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఖేలో ఇండియా కార్యక్రమం, ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన జాతీయ క్రీడల బిల్లు, ఇవన్నీ భారత క్రీడాకారులు ప్రపంచ వేదికపై విజయం సాధించేందుకు ఉద్దేశించిన చర్యలేనని వెల్లడించారు. ప్రస్తుతం ఇవి ప్రతిపాదనల దశలో ఉన్న పథకాల్లో భాగంగా, జిల్లాలలో చిన్న స్థాయి క్రీడా కేంద్రాలు, రాష్ట్ర రాజధానులలో పెద్ద స్థాయి క్రీడా సముదాయాలు, అలాగే 3%-%4 నగరాల మధ్య ఒలింపిక్ స్థాయి గ్రాండ్ సెంటర్లు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయన్నారు. దీనికి వేల కోట్ల రూపాయల పెట్టుబడి క్రీడా మౌలిక వసతుల కోసం కేటాయించబడుతుంది. ఈ ప్రక్రియలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ( ఎస్ఏఐ) నుండి ముఖ్యమైన ఆర్థిక మద్దతు అందుతోందన్నారు. ఈ ప్రతిష్టాత్మక చెస్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న విజ్ఞాన యూనివర్సిటీకి, సహకరించిన ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి టోర్నమెంట్‌ల ద్వారా కోనేరు హంపి, ప్రగ్యానంద, విశ్వనాథన్ ఆనంద్ వంటి మేధావులు వెలుగులోకి వచ్చారన్నారు. ఇక్కడ పాల్గొంటున్న ఆటగాళ్లలో కూడా భవిష్యత్తులో అటువంటి మహానుభావులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

### ఐదో రౌండ్ ఫలితాలు

2013 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో విశ్వనాథన్ ఆనంద్‌కు సెకండ్‌గా ఉన్న, నాలుగు సార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచిన జీఎం కృష్ణన్ సశికిరణ్, రైల్వేల అత్యధిక రేటింగ్ కలిగిన ఇంటర్నేషనల్ మాస్టర్ అరోన్యక్ ఘోష్తో కలిసి ఐదు రౌండ్లలో ఐదు పాయింట్లతో అగ్రస్థానంలోకి దూసుకెళ్లారు. వీరి వెనుక తొమ్మిది మంది ఆటగాళ్లు 4.5 పాయింట్లతో పోటీలో కొనసాగుతున్నారు.
నిమ్జోవిచ్-లార్సెన్ ఆరంభంలో కేరళ యువ ఐఎం హెచ్. గౌతమ్ కృష్ణ చేసిన 39వ మూవ్ లోపాన్ని సశికిరణ్ మొదట వాడుకోలేకపోయినా, తర్వాత క్వీన్, రూక్, బిషప్‌లతో దాడి విరుచుకుపడ్డాడు. ప్రత్యర్థి నైట్ కదలలేని స్థితికి చేరడంతో గౌతమ్ లొంగిపోవాల్సి వచ్చింది.
కారో-కాన్ డిఫెన్స్‌లో అన్ని మైనర్ పీసులు, క్వీన్లు మారిన తర్వాత, అరోన్యక్ ఘోష్కు సులభ విజయం దక్కింది. కశిష్ మనోజ్ జైన్ స్వచ్ఛందంగా రూక్ మార్పు చేసిన తర్వాత 44వ మూవ్‌లో పాన్ ప్రమోషన్ అడ్డుకోలేక జైన్ రాజీనామా చేశాడు. ఉత్కంఠభరిత పోరులో జీఎం ఎస్.పి. సేతురామన్ (PSPB), ఢిల్లీ ఐఎం ఆడీ అమేయపై బిషప్ త్యాగంతో విజయ దిశగా సాగినా, ఒక రూక్ తప్పిదం వల్ల స్థితి చేజారింది. అమేయ ధీటుగా పోరాడి, పైచేయి సాధించే స్థితికి వచ్చినా, చివర్లో వరుస తప్పిదాల కారణంగా గేమ్ 79 మూవ్‌ల తర్వాత డ్రాగా ముగిసింది.
జీఎం సూర్యశేఖర్ గంగూలీ (PSPB), జీఎం లలిత్ బాబు (PSPB)తో క్వీన్స్ గాంబిట్ ఆడి, 30 మూవ్‌ల తర్వాత డ్రాకు అంగీకరించారు. టాప్ సీడ్ పీ. ఇనియన్ (తమిళనాడు) కూడా కర్ణాటక ఐఎం వియాని ఆంటో డికున్హాపై గెలవలేక, ఒకే రంగు బిషప్ ఎండ్గేమ్‌లో 40 మూవ్‌ల తర్వాత డ్రా చేసుకున్నాడు.
పుదుచ్చేరి ఐఎం ఎల్. శ్రీహరి, లిఅజయ్ సంతోష్ పర్వతరెడ్డి (ఉ.ప్ర.)లితో గేమ్‌లో పాన్ పట్టుకుని తన క్వీన్‌ను రూక్ దాడికి బలిచేశాడు. సమాన స్థితి నుంచి అజయ్ ఆధిక్యంలోకి వెళ్ళినా, వెంటనే తానే పొరబడటంతో మళ్లీ పరిస్థితి మారింది. చివరికి వరుస తప్పిదాల తరువాత శ్రీహరి రాజీనామా చేశాడు.
ఐదు సార్లు జాతీయ విజేత జీఎం అభిజీత్ గుప్తా, తమిళనాడు ఛాంపియన్ బి. విజయేష్పై ఏడో వరుసలో శక్తివంతమైన పాన్ ఆధిక్యంతో సులభ విజయం సాధించాడు.
ఆంధ్ర ఆటగాడు, రైల్వేల ఐఎం ఎస్. రవితేజ, ప్రపంచ అమెచ్యూర్ రజత పతక విజేత లిఏ. కుమారేష్ (తమిళనాడు)లిపై విజయాన్ని కొనసాగించాడు. బిషప్ వర్సెస్ నైట్ ఎండ్గేమ్‌లో రవి పాన్ ప్రమోషన్ అడ్డుకోలేక కుమారేష్ రాజీనామా చేశాడు.
తమిళనాడుకు చెందిన జీఎం ఎలెక్ట్ రోహిత్ ఎస్. కృష్ణ, రైల్వేల ఐఎం సుభయన్ కుందుతో రూక్-పాన్ ఎండ్గేమ్‌లో డ్రా చేశాడు.

### ముఖ్య ఫలితాలు - ఐదో రౌండ్

లలిత్ బాబు ఎం.ఆర్. (AP) 4½ - 4½ డ్రా – సూర్యశేఖర్ గంగూలీ (PSPB)

హెచ్. గౌతమ్ కృష్ణ (KL) 4 – 5 ఓటమి – కృష్ణన్ సశికిరణ్ (PSPB)
కశిష్ మనోజ్ జైన్ (MH) 4 – 5 ఓటమి – అరోన్యక్ ఘోష్ (RSPB)
ఎస్.పి. సేతురామన్ (PSPB) 4 - 4½ డ్రా – ఆడీ అమేయ (GA)
వియాని ఆంటో డికున్హా (KA) 4 – 4 డ్రా – పి. ఇనియన్ (TN)
అభిజీత్ గుప్తా (PSPB) 4½ - 3½ గెలుపు – బి. విజయేష్ (TN)
సుభయన్ కుందు (RSPB) 4 – 4 డ్రా – రోహిత్ ఎస్. కృష్ణ (TN)
అజయ్ సంతోష్ పర్వతరెడ్డి (UP) 4½ - 3½ గెలుపు – ఎల్. శ్రీహరి (PY)
ఎస్. రవితేజ (AP) 4½ - 3½ గెలుపు – ఏ. కుమారేష్ (TN)
దీపన్ చక్రవర్తి జె. (RSPB) 4½ - 3½ గెలుపు – అంకిత్ రే (WB)
ఆదిక్ థెఫేన్ లెనిన్ (KL) 3½ - 4½ ఓటమి – ఆదిత్య దింగ్రా (HR)

# నందిగామ లో రాజధాని అభివృద్ధి విజన్ఏ2047 కార్యక్రమం

ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆదేశాలతో పట్టణ పరిధిలోని బాబు జగజీవన్ రామ్ హాలు నందు సి ఆర్ డి ఏ అధికారులు మరియు నందిగామ పట్టణ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాజధాని అభివృద్ధి విజన్ఏ2047 కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి . ఈ కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యురాలు నందిగామను అభివృద్ధి సంక్షేమం దిశగా ఎల్లప్పుడూ పర్యవేక్షిస్తూ ఉన్నారని రాబోయే రోజుల్లో ఎన్నో అభివృద్ధి పథకాల ద్వారా నందిగామను అభివృద్ధి దిశగా చూడాలని మాకు ఎల్లప్పుడూ దిశా నిర్దేశం చేస్తూ ఉంటారని తెలిపారు. నందిగామలో ఎదుర్కొంటున్న డ్రైనేజ్, రోడ్లు , శానిటేషన్ సిబ్బంది కొరత ఇతర సమస్యల గురించి అధికారులకు




వివరించారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ డి ఏ అధికారులు, మున్సిపల్ కమిషనర్ జి . లోవరాజు, పట్టణ పార్టీ అధ్యక్షులు




ఏచూరి రాము , కూటమి నేతలు, పట్టణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

## పాల్గొన్న గడ్డపోతారం కమిషనర్. జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్



**జిన్నారం సెప్టెంబర్ 26 ( లక్ష్యం ప్రతినిధి )**
సంగారెడ్డి జిల్లా గడ్డపోతారు మున్సిపాలిటీ వావిలాలలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకట్రామయ్య మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ మేనేజర్ మధుసూదన్ ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అధికారులు నాయకులు మాట్లాడుతూ ఐలమ్మ చేసిన తెలంగాణ సాయుధ ఉద్యమం సేవలను పోరాటాలను గుర్తు చేశారు. రాబోయే భావితరాలకు ఐలమ్మ ఒక స్ఫూర్తిదాతగా ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు

# ఓటిపి విధానంతో ఆస్తులకు సెక్యూరిటీ

## రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ కమిషనర్ అంబేద్కర్






**మంగళగిరి సెప్టెంబర్ 26 ( లక్ష్యం న్యూస్ ప్రతినిధి)**
ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రవేశ పెట్టిన ఓటిపి విధానం ద్వారా నకిలీ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట పడుతుందని, ఆస్తులకు భద్రత పెరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ కమిషనర్, ఇన్స్పెక్టర్ జనరల్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలిపారు. మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. డిప్యూటీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్ శైలజ ,విజయవాడ డిఐజి రవీంద్ర, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహాలక్ష్మిగా అఖిలాండేశ్వరి అమ్మవారు...



**మంగళగిరి సెప్టెంబర్ 26 ( లక్ష్యం న్యూస్ ప్రతినిధి)**
మంగళగిరి స్టేషన్ రోడ్డులోని శ్రీ అఖిలాండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో ఐదో రోజైన శుక్రవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి గా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించి, కుంకుమ పూజలు నిర్వహించారు. టీడీపీ శాశ్వత సభ్యులు అన్నే చంద్రశేఖర్, శ్రీమతి పద్మలత దంపతులు, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, డాక్టర్ గిరిజ హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్, రమేష్ బాబు మాట్లాడారు. అఖిలాండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. విజయదశమి రోజున జరిగే భారీ అన్నదాన కార్యక్రమం కు సంబంధించిన ఏర్పాట్లుకు కూడా నిర్వాహకులు సుబ్బారావు దంపతులు అహర్నిశలు పనిచేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవాడ దుర్గారావు, అన్నే నందకిషోర్, కట్టా నాని, కదం రాంబాబు, రంగశెట్టి పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం చైర్మన్ కాలారి సుబ్బారావు దంపతులు పర్యవేక్షించారు.

## బ్యానర్ల చించివేత పై

# మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు




**మంగళగిరి సెప్టెంబర్ 26 ( లక్ష్యం న్యూస్ ప్రతినిధి)**
దసరా నవరాత్రుల సందర్భంగా పార్క్ రోడ్డు లో అమ్మవారి చిత్రాలతో మూడు బ్యానర్లను ఏర్పాటు చేశారు. వీటిలో రెండు బ్యానర్లను గుర్తు తెలియని దుండగులు చించి వేశారని నూక బత్తిన పూర్ణ భవాని ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకొని భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని కోరారు.సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా విచారించి కేసు నమోదు చేస్తామని పట్టణ ఎస్సై శ్రీహరి తెలిపారు.

# బిజెపిలో చేరిన సింగారెడ్డి శేషాద్రి రెడ్డి



**చిలకలూరిపేట సెప్టెంబర్ 26లక్ష్యం న్యూస్**
భారతీయ జనతా పార్టీ నాయకులు వరికూటి నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ ఆధ్వర్యంలో బీజేపీ లో చేరినసింగారెడ్డి శేషాద్రిరెడ్డి కి బిజెపి అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ కండువా కప్పిపార్టీ లోకిసాదరంగా ఆహ్వానించారు.సింగారెడ్డి శేషాద్రి రెడ్డి మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన పెద్దలకు ముఖ్యులకు బిజెపి పార్టీ నాయకులకు అభినందనలు తెలిపారు, పార్టీ బలోపేతానికి తప్పక కృషి చేస్తానని అన్నారు, నా మీద ఎంతో విశ్వాసంతో నమ్మకంతో నాకు పార్టీలోకి సాధర ఆహ్వానం పలికిన పెద్దలకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపిఅధికార ప్రతినిధి చిలువోలు బుచ్చిబాబు, రాష్ట్ర కార్యదర్శి మేకల హనుమంతరావు, పల్నాడు జిల్లా ఇంచార్జ్ కోక్కెర శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు కోట పవన్ కుమార్ గాంధీ, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల శివ నాగేశ్వరరావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు నెల్లూరు ఈశ్వర్ రంజిత్, జిల్లా సెక్రెటరీ గట్ట హేమ కుమార్, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# క్షమాపణలు చెప్పకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం




**గుంటూరు సెప్టెంబర్ 26 లక్ష్యం ప్రతినిధి.**
అసెంబ్లీలో మాజీ సీఎం జగన్ పైన, సినీ హీరో చిరంజీవి పైన అనుచిత వ్యాఖ్యలు చేయడానీ సహించబోమని వైసిపి యువజన విభాగం ప్రకటించింది. గార్డెన్స్ లోని జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఉత్తేజ్ తో పాటు రాష్ట్ర నాయకులు మాట్లాడారు. అసెంబ్లీలో తమ నేత జగన్ పైన,సినీ రంగంపై బిజెపి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ను ఖండిస్తున్నామన్నారు. అలాగే చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. దీనిపై బాలకృష్ణ చేసినా అభ్యంతరకర వ్యాఖ్యలు సహించేది లేదన్నారు . మాజీ సీఎం జగన్ పై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని అన్నారు . అసెంబ్లీలో క్షమాపణలు చెప్పాలని లేకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని ఉత్తేజ్, రాష్ట్ర నాయకులు హెచ్చరించారు.

ప్రజా చైతన్యమే...
లక్ష్యం
తెలుగు దినపత్రిక
శనివారం, 27-9-2025

## సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ
# ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు




**తెనాలి సెప్టెంబర్26(లక్ష్యంన్యూస్)** విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు దోహదపడతాయని సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కంకిపాటి రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జెఎంజె కళాశాలలో సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ, మేరా యువభారత్ సంయుక్త ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరిచిన ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానాలను నిలిచిన విద్యార్థినిలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ డాక్టర్ శాంత, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ రోజీ, సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి బి. సుధాకర్, సభ్యులు బొమ్ము రామకృష్ణారెడ్డి, ఎం పూర్ణ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ దాసరి విజయలక్ష్మి, హైకోర్టు న్యాయవాది వింజమూరి ప్రసాద్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు ఓతుకోలు మార్కండేయులు, కాకుమాను వనజ విద్యార్థులు పాల్గొన్నారు.

# కారుచోల లో స్వస్థ నారీ శక్తివంతమైన
## కుటుంబ అభియాన్ కార్యక్రమం...




**యడ్లపాడు సెప్టెంబర్ 26 లక్ష్యం న్యూస్** ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కారుచోల ఆరోగ్య సచివాలయం నందు "స్వస్థ నారీ శక్తివంతమైన కుటుంబ అభియాన్ కార్యక్రమం" ప్రభుత్వ వైద్యాధికారి పి భరద్వాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కారుచోల ఆరోగ్య సచివాలయం పరిధిలో 91 మంది స్త్రీలకు వైద్య ఆరోగ్య సిబ్బందిచే అన్ని ఆరోగ్య పరీక్షలు అనగా కాన్సర్ స్క్రీనింగ్, షుగర్, బీ.పీ., హీమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. వైద్యాధికారిచే గర్భిణీ స్త్రీలకు టి టి వ్యాక్సిన్ తో పాటుగా ఐరన్, కాల్షియం బిళ్ళలు, వారికి ఆరోగ్య పరీక్షలు, కుటుంబ నియంత్రణ సలహాలు ఇచ్చరు. వారి పరీక్షల వివరాలు ఆర్ సి హెచ్ పోర్టల్ నందు ఆన్ లైన్ చేసి, చిన్నారులకు వాక్సినేషన్ చేశారు. పీఎంజెఏవై కార్డులు,వైయో వందన కార్డ్స్ ,ఆన్ లైన్ చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోవైద్యాధికారి డా..పి.భరద్వాజ,ఆరోగ్య సిబ్బంది, మరియు ఆశా కార్యకర్తలు పాల్గొని తమ సేవలు అందించారు.


# హైడ్రా బాధితులకు అండగా నిలుస్తాం
## బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 26 (లక్ష్యం ప్రతినిధి)** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజుల రామారం125 డివిజన్ బాలయ్య నగర్, గాలి పోచమ్మ బస్తీలలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పర్యటించి ఇటీవల హైడ్రా అధికారులు కూల్చివేసిన ఇళ్లను, బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...... సర్వే నెంబర్ 307లో ఏళ్లకు ఏళ్లుగా నివాసం ఉంటున్న రెక్కాడితే గానీ డొక్కాడని పేదవాళ్లు ఉంటున్న నివాసాలను, పండుగ పూట అధికారులు కూల్చివేయడం దారుణమన్నారు. ఈ కూల్చివేతలపై త్వరలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కలిసి పూర్తి సమాచారం అందజేసి నిజమైన బాధితులకు అండగా ఉండి వారికి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా బస్తీల వాసులు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదవరోజు లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణ





**తాడికొండ,సెప్టెంబర్26(లక్ష్యం)** మండల కేంద్రమైన తాడికొండలోని శివాలయం వీధి నందు గల తాడికొండ భవాని పీఠం వారి భవాని క్షేత్రము తాడికొండ శివారు బడేపురం కొండ దిగువన గల క్షేత్రములో కొలువైన విజయ భవాని అమ్మవారికి జరుగుతున్న శరన్నవరాత్రోత్సవాలు భాగంగా ఐదవ రోజు శుక్రవారం శ్రీ భవాని అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంకాలం విశేష పుష్పార్చన, సహస్ర నామ కుంకుమార్చనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భవాని పీఠ వ్యవస్థాపకులు కొల్లిపర నాగ కోటేశ్వర శర్మ,భవాని పీఠ కోశాధికారి శ్రీమతి సుభాషిణి దినేష్,వేద పండితులు బాలాజీ శర్మ,తాడికొండ భవాని పీఠ సభ్యులు వెంకటేశ్వర్లు, పుర ప్రముఖులు ఉప్పలపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. చివరగా తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

# టి జె పి యస్ కళాశాల తెలుగు అధ్యాపకునికి జాతీయ ఉత్తమ అధ్యాపక పురస్కారం




**గుంటూరు సెప్టెంబరు 25( లక్ష్యం న్యూస్ )::** స్థానిక తెల్లాకుల జాలయ్య పోలిశెట్టి సోమసుందరం( స్వయం ప్రతి పత్తి) కళాశాల లో తెలుగు అధ్యాపకునిగా మరియు శాఖాదిపతి గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జె వి సుధీర్ కుమార్ గారు ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వర శాస్త్రి పేర్కొన్నారు. వీరు మాట్లాడుతూ శారదా ఎడ్యుకేషనల్ సొసైటి (హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం ) వారు నిన్న 25 వ తేది హైదరాబాద్ లో బిర్లా మందిర్ వేదికగా జరిగిన కార్యక్రమం లో ముఖ్య అతిథి ప్రొఫెసర్ ఇ పురుషోత్తం (వైస్ చైర్మన్, తెలంగాణ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్) గారి చేతులమీదుగా పురస్కారం అందుకున్నట్లు చెప్పారు.డాక్టర్ సుధీర్ కుమార్ గారు గత 15 సంవత్సరాల నుండి తెలుగు అధ్యాపకనిగా విధులు నిర్వహిస్తూ, మాతృ భాషలో సాహిత్య సేవ చేస్తున్నందుకు పురస్కారం ఇచ్చినట్లు తెలియచేశారు. పురస్కారం అందుకున్న సుధీర్ కుమార్ ని కళాశాల అధ్యక్షులు శ్రీ పోలిశెట్టి శ్యాం సుందర్, సెక్రటరీ & కరస్పాండంట్ శ్రీ కె వి బ్రహ్మం గారు, పి జి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ అనితా దేవి గారు అభినందనలు తెలియచేశారు. పురస్కార గ్రహీత మాట్లాడుతూ మెరుగైన సమాజ నిర్మాణంలో అధ్యాపకుల పాత్ర కీలకం గా ఉంటుందని, అధ్యాపక వృత్తి లో ఉన్నటువంటి సంతృప్తి మరెక్కడా ఉండదని, ఈ పురస్కారం రావడం నాకు మరింత బాధ్యత పెంచిందని, పురస్కారాలు, పెద్దల అభినందనలు అధ్యాపకులలో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తాయని, నన్ను పురస్కారానికి ఎంపిక చేసిన వారికి, నాకు అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదములు అని చెప్పారు.

# పట్టణ అభివృదేలక్ష్యంగా దూకుడు పెంచిన ప్రత్తిపాటి



**చిలకలూరిపేట సెప్టెంబర్ 26 లక్ష్యం న్యూస్** మాజీ మంత్రి,శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుఆదేశాల మేరకు పట్టణంలో పలుచోట్ల సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు కొత్తగా నిర్మించడం జరుగుతుంది. అందులో భాగంగాపట్టణం లోని 38వ వార్డు పోలిరెడ్డిపాలెం లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, వంటి అభివృద్ధి పనులు వచ్చేస్తుండగాకౌన్సిలర్ జంగా సుజాత దగ్గరుండి నాణ్యమైన వస్తువులతో చేసే రోడ్లు నిర్మాణపనులను పరిశీలించారు. అభివృద్ధి లక్ష్యంగా పనిచేసే నాయకుడు ప్రత్తిపాటినియోజకవర్గానికి ప్రతిపాటి లాంటి నాయకుడు దొరకటం మేము చేసుకున్న అదృష్టమంటూ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. జంగా వినాయకరావు కౌన్సిలర్ జంగా సుజాత లాంటి వారు మా గ్రామాల్లో నాయకులుగా ఉంటూ ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలబడుతూ గవర్నమెంట్ ద్వారా అందే పథకాలలో ఏమన్నా ఇబ్బందులు ఉన్న దగ్గరుండి పరిశీలించి వారికి వచ్చేవరకు కృషి చేస్తూ మదర్ తెరిసా రీతిలోప్రజలకు సేవ చేసే ఆదర్శ దంపతులు అంటూ అవార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంగా వినాయక రావు వార్డు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ధనలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు









**తెనాలి సెప్టెంబర్26(లక్ష్యంన్యూస్)** స్థానిక బోస్ రోడ్డు లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం వాసవి అమ్మవారు, శ్రీ ధనలక్ష్మి దేవి రూపంలోనూ శ్రీ రాజరాజేశ్వరి దేవి శ్రీ గజలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఐదవ రోజు అమ్మవారు ధనలక్ష్మి రూపంలో దర్శనం ఇవ్వటంతో అమ్మవారిని రూపాయి నోటు నుండి రెండు రూపాయలు ఐదు రూపాయలు, పది రూపాయలు 500 రూపాయలు కరెన్సీ నోట్లతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. కరెన్సీ నోట్లతో అలంకరింపబడిన అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం విశేష పూజలు అర్చనలు అభిషేకాలు పూజాది కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలియజేశారు. ప్రతిరోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని ఈ నేపథ్యంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకోవాలని అర్చకులు తెలియజేశారు. స్థానిక మారీసుపేటలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారి దేవస్థానంలో శరన్నవరాత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దేవస్థానం అధ్యక్షులు గ్రంధి సేతు మాధవరావు, ఆధ్వర్యంలో ఉత్సవాలు విశేషంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారు 70 లక్షల రూపాయల నోట్ల తో శ్రీ ధనలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

భక్తులు విశేషంగా అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ప్రతిరోజు అమ్మవారికి విశేష పూజాది కార్యక్రమాలు, అభిషేకాలు ఉంటాయని ఆలయ అర్చకులు తెలిపారు. కాగా ఐదో రోజు శ్రీ అమ్మవారిని 70 లక్షల రూపాయల కరెన్సీ నోట్లతో అమ్మవారిని ధనలక్ష్మి రూపంలో విశేషంగా అలంకరించినట్లు కార్యదర్శి పొన్నూరు నాగ సూర్య శశిధర రావు తెలిపారు. ధనలక్ష్మి రూపంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని ఆశీస్సులు అందుకోవాలని కోరారు. స్థానిక దేవి చౌక్ లోని శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి దేవస్థానంలో 94వ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమ్మవారు శ్రీ ధనలక్ష్మి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్లతో చేసిన అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇదేవిధంగా ప్రతిరోజు అమ్మవారు వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనం ఇస్తారని ఆలయ అర్చకులు యనమండ్ర లక్ష్మీ నరసింహమూర్తి తెలిపారు.ఆలయ కమిటీ చైర్మన్ టీవీఎస్ శాస్త్రి మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 9 గంటలకు బాల పూజ జరుగుతుందని మధ్యాహ్నం ఒంటిగంటకి శ్రీ చక్ర అర్చన, ఏడు గంటలకి తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందని చెప్పారు. ప్రతిరోజు అమ్మవారిని దర్శించి, అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలని అన్నారు. స్థానిక శివాజీ చౌక్ లోని శ్రీ కాళీమాత ఆలయంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు తొలి రోజు నుండి అంగరంగ వైభంగా జరుగుతున్నాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ నేతృత్వంలో దసరా నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. 32 సంవత్సరాలుగా శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఆలయం వద్ద ప్రతిరోజు నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా గురువారం రాత్రి చిన్నారులు చేసిన కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు కటారి వాసుదేవ నాయుడు, టి అనంతాచార్యులు కే కిషోర్ చేతుల మీదుగా చిన్నారులకు మేమేంటోలను కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో అందజేశారు. దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు హిందూ సాంప్రదాయ ప్రతీకలని అనంతాచార్యులు అన్నారు. స్థానిక కొత్తపేటలోని శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని శ్రీ ధనలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి శ్రీధనలక్ష్మి దేవి గా కరెన్సీ నోట్లతో అలంకరించినట్లు ప్రధాన అర్చకులు ఎన్. శ్రీరామ చక్రవర్తి తెలియజేశారు ప్రతిరోజు ఉదయం 10 గంటలకు సహస్రనామార్చన, అష్టోత్తర కార్యక్రమాలు జరుగుతాయని, 11 రోజులు పాటు జరిగే విశేష పూజాది కార్యక్రమాలకు భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలని అర్చకులు శ్రీరామ చక్రవర్తి తెలియజేశారు. స్థానిక గంగానమ్మపేట లోని రజక పార్కు వద్ద గల శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రాచీన పుట్ట వద్ద శ్రీ కామాక్షమ్మ అమ్మవారి దేవస్థానం నందు 66వ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు శ్రీ ధనలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు అనంతరం అమ్మవారిని కరెన్సీ నోట్లతో. అద్భుతంగా అలంకరించారు. ఆలయ వ్యవస్థాపకుల వంశీకులు దావులూరి ఫణీంద్ర వరకుమార్ ధర్మకర్త దావులూరి పద్మావతి, వేద పండితులు ప్రతాపగిరి ప్రదీప్ కుమార శాస్త్రి ఆధ్వర్యంలో ఈ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటలకు వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ లలితా సహస్రనామ కుంకు మార్చనను భక్తులు స్వయంగా చేసుకోవచ్చని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలియజేశారు.



# ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

## ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే జూలకంటి అభినందనలు

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :**

ఉపాధ్యాయుల చేతుల్లోనే భావి భారతాన్ని తీర్చే శక్తి ఉంటుందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. డీఎస్సీలో సత్తా చాటి, నూతన ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రతిఒక్కరికీ శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. అమరావతి వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ చేతులు మీదిగా నియామక పత్రాలు అందుకున్న మాచర్ల నియోజకవర్గ నూతన ఉపాధ్యాయుల బృందం శుక్రవారం ఎమ్మెల్యే జూలకంటిని కలవగా వారిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెగా డీఎస్సీలో మాచర్ల నియోజకవర్గం నుంచి 98 మంది డీఎస్సీ అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పల్నాడు జిల్లాలో అత్యధిక నూతన ఉపాధ్యాయులుగా మాచర్ల నియోజకవర్గం నుంచి ఎంపికకావడం గర్వకారణమన్నారు. అలానే యువత విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మరింతగా పోటీపడి, మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఈ సందర్భంగా జూలకంటి ఆకాంక్షించారు.



నియామకపత్రాలు అందుకున్న ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే జూలకంటి

# తిరుగుబాటు తత్వానికి, ప్రతిఘటన పోరాటానికి స్ఫూర్తి ఐలమ్మ..

**బహుజనుల కోసం బంధుకులు పట్టి..**
**సమానత్వం కోసం పోరాడిన వీరనారి..**
**ఆ మహనీయుల స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం :**
**నీలం మధు ముదిరాజ్..**
**చిట్కుల్ లో ఘనంగా ఐలమ్మ జయంతి వేడుకలు..**



**పటాన్ చెరువు సెప్టెంబర్ 26 (లక్ష్యం ప్రతినిధి)**

పెత్తందారుల చేతిలో అణిచివేయబడ్డ వర్గాలకు తిరుగుబాటు తత్వాన్ని నేర్పించి ప్రతిఘటించే పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.దశుక్రవారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని చిట్కుల్ లోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర మొత్తం త్యాగధనుల అమరత్వమేనని ఆ మహనీయుల ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణలో ప్రశ్నించే తత్వం అలవడిందన్నారు. నిజాం నిరంకుశ పాలనలో శిథిలమైపోయిన బతుకులను బాగు చేయడానికి వెట్టి చాకిరికి వ్యతిరేకంగా దొరలు జమీందారుల చేతుల్లో బానిసలుగా మగ్గుతున్న బహుజనులకు స్ఫూర్తినిస్తూ నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. ఆనాడు బహుజనుల కోసం పోరాటం చేసిన ఆ మహనీయుల స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు పంచాలనే సంకల్పంతో వీరనారి సబ్బండ వర్గాల ప్రతినిధి చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహాన్ని చిట్కుల్లో ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఆ మహనీయుల త్యాగఫలంతో వారు ఇచ్చిన స్ఫూర్తితో సిద్ధించిన తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మహనీయుల ఆశయాల కనుగుణంగా పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ఆ మహనీయుల స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలని సంకల్పంతో హైదరాబాద్ లోని మహిళా యూనివర్సిటీ కి చాకలి ఐలమ్మ పేరుని పెట్టి ఆ వీరనారికి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందన్నారు. రేవంతన్న స్ఫూర్తితో సబ్బండ, బడుగు బలహీన వర్గాల హక్కులకే పోరాడుతూ వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, మహేష్, సత్తయ్య, నర్సింలు, అర్జున్, గోపాల్, కిషోర్, చంద్రశేఖర్, రజక సోదరులు తదితరులు పాల్గొన్నారు

# ఎన్నారై కళాశాలలో ఫ్రెషర్స్ డే




**తెనాలి సెప్టెంబర్26(లక్ష్యంన్యూస్)**

ఎన్నారై సొసైటీ ఆధ్వర్యంలో నడపబడుచున్న డిగ్రీకళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సి.ఈ.ఓ.సి.హెచ్. ఉమామహేశ్వర రావు నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులందరూ డిగ్రీ కోర్సును మంచి ఉత్తీర్ణతా శాతంతో పూర్తిచేసుకొని వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడానికి మన కళాశాల తగిన ప్రణాళికలతో ముందుకు సాగుతుందని, ఈ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థిని పూర్తి పరిజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో కళాశాల యాజమాన్యం, సిబ్బంది పూర్తి సహకారం ఉంటుందని విద్యార్థులకు తెలిపారు. ఈ కళాశాలలో డిగ్రీ విద్యతోపాటు పోటీపరీక్షలకు కావలసిన అంశాలను బోధించి భవిష్యత్తులో మంచి ఉద్యోగార్థులుగా స్థిరపడి కళాశాలకు మంచి పేరు తేవాలని అభిలషించారు. డిగ్రీ విద్య పూర్తి చేసిన వెంటనే సంబంధిత ఉద్యోగాలును ప్లేస్మెంట్ ద్వారా పొందుటకు ప్రతి విద్యార్థికి అవకాశం కల్పిస్తామని సి.ఈ.ఓ తెలియపరచారు. ఈ సందర్భంగా యన్.ఆర్.ఐ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యం. లాజర్ బాబు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ యస్. శివన్నారాయణ, కె. క్రిష్ణారెడ్డి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



# 22 ఏ (1) సీ సమస్య పరిష్కారంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి : ప్రత్తిపాటి

**-సబ్ కమిటీ విచారణ ఏ దశలో ఉందో, సమస్య ఎప్పటికిపరిష్కారమవుతుందోననే ఆందోళనలో ప్రజలు ఉన్నారు**

**-చిలకలూరిపేట పట్టణ ప్రజల్లో సగం మంది ఈసమస్యతఇబ్బందులుఎదుర్కొంటున్నారు.**

**-జీరో అవర్లో సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన మాజీమంత్రి ప్రత్తిపాటి**

**చిలకలూరిపేటసెప్టెంబర్26( లక్ష్యంన్యూస్)**

22 ఏ (1) సీ నిబంధన వల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలమంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చిలకలూరిపేట పట్టణంలో ఇళ్లు నిర్మించుకున్న స్థానికులు ఈ సమస్యవల్ల ఇబ్బందులు పడుతున్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.

శుక్రవారం అసెంబ్లీలో జరిగిన జీరో అవర్లో ఆయన ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.



**22 ఏ (1) సీ పరిష్కారంతో ప్రజలు ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులు తొలగుతాయి.**

సమస్య పరిష్కారానికి గతంలో ముఖ్యమంత్రి, దేవాదాయ, న్యాయ, రెవెన్యూశాఖ మంత్రులతో ఒక సబ్ కమిటీ వేశారని, కానీ సమస్య పరిష్కారం ఇంకా కొలిక్కి రాలేదని ప్రత్తిపాటి తెలిపారు. కమిటీ విచారణ ఏ దశలో ఉందోసమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో ప్రజల ఇబ్బందులు ఎప్పటికి పరిష్కారమవుతాయో వారికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. సమస్య 22 (ఏ) కు, ఫ్రీ హెూల్డ్ భూములకు సంబంధించింది కాదని. సర్వీస్ ఈనాం భూములదని ప్రత్తిపాటి చెప్పారు. 22 ఏ (1) సీ సమస్య ప్రభుత్వం సకాలంలో పరిష్కరించకుంటే ప్రజలు తీవ్రఆందోళనతో నిరసన వ్యక్తం చేసే అవకాశముందని మాజీమంత్రి అభిప్రాయపడ్డారు. చిలకలూరిపేట పట్టణంలో నివసించే ప్రజల్లో సగానికిపైగా ఈ సమస్య ఎదుర్కొంటున్నారని, భూముల్లో నివాసముంటూ కూడా సంతోషంగా లేరని, ఎప్పుడు ఏమవుతుందోననే ఆందోళనలో ఉన్నారని ప్రత్తిపాటి తెలిపారు. సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియచేయవలసిందిగా సభద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నానని ప్రత్తిపాటి స్పష్టంచేశారు.

# సూపర్ జిఎస్టి-సూపర్ సేవింగ్స్ పై అవగాహన కల్పించండి

**జిఎస్టి 2.0కు ముందు, ఆతరువాత ధరల మార్పుపై**
**వ్యాపారులు బోర్డులు ఏర్పాటు చేయాలి**
**మున్సిపల్ కమీషనర్**
**డి వేణుబాబు, డిసిటిఓ శేషగిరిరావు**

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :**

సూపర్ జిఎస్టి- సూపర్ సేవింగ్స్ పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మున్సిపల్ కమీషనర్ దూళిపాళ్ళ వేణుబాబు, డిసిటిఓ శేషగిరిరావులు సూచించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హల్లో శుక్రవారం సాయంత్రం వ్యాపారులు, డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బందితో జిఎస్టి టి 2.0పై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో మున్సిపల్ కమీషనర్ దూళిపాళ్ళ వేణుబాబు, డిసిటిఓ శేషగిరిరావులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికంగా చేయూతను ఇచ్చేందుకు జిఎస్టి 2.0 పేరిట 4 రకాల పన్ను స్లాబ్ లను రెండు రకాలుగా కుదించినట్లు వివరించారు. పాలు, వెన్న, ఆహార తదితర నిత్యవసర వస్తువులు, ఆరోగ్యం కోసం వినియోగించే మందులపై, వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు తదితర వాహనాలపై, విద్యారంగంలో వినియోగించే నోట్ పుస్తకాలు, పెన్నులు, ఎల్ ఐసి, హెల్త్ పాలసీలు తదితరపై పెద్దఎత్తున పన్నులు తగ్గించటం వలన సగటున ప్రతి కుటుంబానికి నెలకు రూ 1,000/- ఆదా అవుతుందన్నారు. ఈ ఆదా రాష్ట్ర వ్యాప్తంగా రూ. 8వేల కోట్లు ప్రజలకు సేవింగ్స్ గా మారనున్నట్లు వివరించారు. ఈ మార్పు ప్రజలకు అవగాహన కల్పించేందుకు డ్వాక్రా మహిళలు ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తారన్నారు. వ్యాపారులు కూడ తమ షాపుల వద్ద జిఎస్టి టి 2.0కు ముందు,ఆతరువాత వారు అమ్మకాలు జరిపే వస్తువుల ధరల మార్పుపై బోర్డులు తయారు చేసి పెట్టాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు పెద్దఎత్తుల పన్ను తగ్గింపు వలన జరిగే ప్రయోజనాలను అంతిమంగా ప్రజలకు అందేందుకు అధికార యంత్రాంగం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యాపార సంఘాల నాయకులు తుమ్మేపల్లి సాంబశివరావు, జి. రామమూర్తి, దేవకి వెంకటశేష పుల్లారావు, కుతూట్ల శ్రీనివాసరావు, చుండూరి నరసింహరావు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిసిటిఓ శేషగిరిరావులు

# నందిగామ లో రాజధాని అభివృద్ధి విజన్ఏ2047 కార్యక్రమం



ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆదేశాలతో పట్టణ పరిధిలోని బాబు జగజీవన్ రామ్ హాలు నందు సి ఆర్ డి ఏ అధికారులు మరియు నందిగామ పట్టణ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాజధాని అభివృద్ధి విజన్ఏ2047 . ఈ కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యురాలు నందిగామను అభివృద్ధి సంక్షేమం దిశగా ఎల్లప్పుడూ పర్యవేక్షిస్తూ ఉన్నారని రాబోయే రోజుల్లో ఎన్నో అభివృద్ధి పథకాల ద్వారా నందిగామను అభివృద్ధి దిశగా చూడాలని మాకు ఎల్లప్పుడూ దిశా నిర్దేశం చేస్తూ ఉంటారని తెలిపారు. నందిగామలో ఎదుర్కొంటున్న డ్రైనేజ్, రోడ్లు , శానిటేషన్ సిబ్బంది కొరత ఇతర సమస్యల గురించి అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ డి ఏ అధికారులకు పై విషయాలపై దృష్టిసారించాలని పట్టణ పార్టీ అధ్యక్షులు ఏచూరి రాము ,ఇంటిమాలఆనంద్ విన్నవించారు. ఈ కార్యక్రమం లో కూటమి నేతలు, పట్టణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మాదిరి పృథ్వీరాజ్



**పటాన్ చెరువు సెప్టెంబర్ 26 (లక్ష్యం ప్రతినిధి )**

పటాన్చెరువు సాకి చెరువు ఆవరణలో ఘనంగా నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాదిరి ప్రిథ్వీరాజ్ ఈ సందర్భంగా ప్రిథ్వీరాజ్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి సమాజంలో ఎప్పటికీ నిలిచిపోతుంది. రైతాంగం, కూలీలు, బలహీన వర్గాల కోసం ఆమె చేసిన త్యాగాలు స్ఫూర్తిదాయకం. యువతరం ఆమె ఆలోచనలతో ముందుకు సాగితేనే సమాజంలో నిజమైన సమానత్వం, న్యాయం సాధ్యమవుతుంది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొని చాకలి ఐలమ్మ గారి జ్ఞాపకాలను స్మరించుకున్నారు.ద


# ఎల్ ఓ సి అందజేసిన ఎమ్మెల్యే

**పటాన్చెరు సెప్టెంబర్ 26 (లక్ష్యం ప్రతినిధి)**

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి వరప్రదాయనిగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బిహెచ్ఇఎల్ టౌన్షిప్ లో నివసిస్తున్న షేక్ ఇబ్రహీం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో షేక్ ఇబ్రహీం కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, శ్రీధర్ చారి, చంద్రశేఖర్, రామిశెట్టి, తదితరులు పాల్గొన్నారు.



# రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ



చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద పేదలకు చీరలను పంచుతున్న దృశ్యం

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :**

తెలంగాణ సాయుధ పోరాటంలో పేద ప్రజలకు అండగా నిలబడి, భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన వీర నారి ఐలమ్మ అని లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డి అన్నారు.చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మన్నెం పాండురంగారావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నాటి నియంతృత్వ రజాకార్ల ప్రభుత్వంపై ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. సాయుధ పోరాటంలో పదివేల మందికి పైగా ప్రాణాలను కోల్పోయారని, వారి త్యాగ ఫలితంగా పది లక్షల ఎకరాలు భూమి తెలంగాణ ప్రాంతంలో పేద రైతులకు పంచిపెట్టడం జరిగిందన్నారు. అనంతరంనిరుపేద 25 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, అబ్దుల్ కలాం సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ పాషావలి, లైన్స్ క్లబ్ పాస్ట్ రీజియన్ చైర్మన్ కొమర నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ బచ్చు వెంకట సుబ్బారావు, ఎల్ఐసి డెవలప్మెంట్ అధికారి ఊటుకూరి సత్యనారాయణ, వాసవి క్లబ్ రీజియన్ సెక్రెటరీ చుండూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వర స్వామికి వెండి ఆభరణాలు అందజేసిన భక్తులు

**తెనాలి సెప్టెంబర్26(లక్ష్యంన్యూస్)**

స్థానిక చినరావూరులోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామికి గురువారం భక్తులు, గ్రామస్తులు పలు వెండి ఆభరణాలను ఆలయ కార్యనిర్వహణాధికారి హరిప్రసాద్ కు వెండి ఆభరణాలను అందజేశారు. అర్చకులు గూడూరు ఈశ్వర భరద్వాజ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఇ.వో హరిప్రసాద్ మాట్లాడుతూ ఆలయంలోని విఘ్నేశ్వర స్వామికి గ్రామస్తులు 629 గ్రాములతో వెండి తొండమును, నామాలను అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు గొల్లమూడి అప్పారావు, గొల్లమూడి వెంకటేశ్వరరావు, సూర్యదేవర శివలింగ ప్రసాద్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, వాసిరెడ్డి అశోక్ బాబు, సులోచన, పుట్టి శ్రీను, జ్యోతి ,తదితరులు పాల్గొన్నారు.



# గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం




**జిన్నారం సెప్టెంబర్ 26 (లక్ష్యం ప్రతినిధి )**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం స్వచ్ఛతా హి సేవ -2025 కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో గడ్డపోతారం పురపాలక సంఘం మెయిన్ రోడ్డు ప్రక్కన గల ఖాళీ స్థలంలో వేసిన చెత్త కుప్ప, వ్యర్థాలను, మరియు రోడ్లను ఊడ్చే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు , ఎన్ జివోఎస్ సహకారంతో మరియు పట్టణ ప్రజలు పాల్గొన్న ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాత్ స్వచ్ఛత కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో కలిసి శ్రమదాన కార్యక్రమం చేపట్టడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాజీ ఉపసర్పంచ్ సరిత శ్రీనివాస్, మెట్ల నగేష్, శంకర్, బిక్షపతి,బాబు, మున్సిపల్ ఇఇ నరసింహారాజు, మేనేజర్ మధుసూదన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నవీన్ అనుపమ,భవాని, మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది

# దేవరకొండ రమాదేవి రజక సంఘం మహిళా అధ్యక్షురాలు ఏపీ ఐలమ్మ జయంతి



చిట్యాల ఐలమ్మ (సెప్టెంబరు 26, 1895 – సెప్టెంబర్ 10, 1985) చాకలి ఐలమ్మగా గుర్తింపు పొందిన తెలంగాణ ఉద్యమకారిణి వీరవనిత. తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి.2022 నుండి తెలంగాణ ప్రభుత్వం ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని కేకు కట్ చేసిన అనంతరం నందిగామ జంగాలకాలనిలో సంచార జాతులు చెందిన వారికీ వస్త్రాలు పంచి పెట్టిన దేవర కొండ రమాదేవి వీర నారి ఐలమ్మ నియోజకవర్గం పాలకుర్తిజననంసెప్టెంబరు 26, 1895, (సద్దుల బతుకమ్మ పండుగ రోజు) క్రిష్టాపురం గ్రామం, రాయపర్తి మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణమరణంసెప్టెంబరు 10, 1985 (వయసు 90)మరణించిన నారని తెలిపారు పాలకుర్తి, వరంగల్ జిల్లా, తెలంగాణరాజకీయ పార్టీ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ అని ఈసందర్భంగా రమాదేవి మాట్లాడుతు వివరించారు

# నిరంతరం ప్రజా సమస్యల పరిష్కానికి కృషి చేస్తా

## నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 26 (లక్ష్యం ప్రతినిధి)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ని నియోజకవర్గానికి చెందిన ప్రజలు, కాలనీ సభ్యులు, నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు వారు సానుకూలంగా స్పందించారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గారు, ఎమ్మెల్యే కె.పి వివేకానంద దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు

# డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం.

**గుంటూరు సెప్టెంబర్ 26( లక్ష్యం న్యూస్ )::**

సదరన్ ప్రైవేట్ లెక్చరర్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్ పి ఎల్ టి ఓ) వారు అక్టోబర్ 5వ తేదీ ఇంటర్నేషనల్ టీచర్స్ డే మరియు అక్టోబర్ 15వ తేదీ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఈ రెండు సందర్భాలను పురస్కరించుకొని 2025వ సంవత్సరానికి గాను డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ పురస్కారాలను ప్రకటించింది. కావున ప్రైవేట్ కాలేజీ మరియు స్కూల్ యజమానులైన డైరెక్టర్స్, సెక్రటరీ %ఛ% కరెస్పాండెంట్, ఆచార్యులు మరియు అధ్యాపకులు నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్ పి ఎల్ టి ఓ గౌరవ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రతిభ పురస్కారాలకు ఎంపికైన అవార్డు గ్రహీతలకు ఈనెల 26వ తారీకు ఆదివారం 2 గంటలు నుండి 7 గంటల మధ్యలో అవార్డుల గ్రహీతలకు సన్మాన కార్యక్రమం గుంటూరులో జరుగుతున్నట్లు ఎస్ పి ఎల్ టి ఓ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పయర్ల. నాగయ్య తెలియజేశారు. తేదీ అక్టోబర్ 15వ తారీకు లోపు దరఖాస్తులను తప్పించవలసిందిగా వారు కోరారు. ఇతర వివరాల కోసం 9949929674 మరియు 7989088274 నంబర్లను సంప్రదించగలరు.

# వీరవనిత చిట్యాల ఐలమ్మ 130 వ జయంతి వేడుకల ను ఘనంగా నిర్వహించిన బీసీ నేతలు

**మంగళగిరి సెప్టెంబర్ 26( లక్ష్యం న్యూస్ )::**



భూమి కోసం,భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుండి విముక్తి కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆహరహం పోరాడిన వీర వనిత,తెలంగాణ విప్లవ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ అంటూ,ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కీర్తించారు. ఈరోజు స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఐలమ్మ 130వ జయంతి వేడుకల సందర్భంగా,ఆమె చిత్రపటానికి పలువురు బీసీ నాయకులు పూలమాలలు వేసి,మిఠాయిలు పంచుకుంటూ ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ, ఆనాటి అరాచక నిజాం పాలనకు, రజాకార్ల దౌష్టియానికి,ఆధిపత్య పెత్తందారీ దొరల గడీలలో జరిగే దుర్మార్గాలకు వ్యతిరేకంగా, సాయుధ పోరాటం చేసిన వీర వనిత చిట్యాల ఐలమ్మ అన్నారు. ఎర్ర జెండా నీడలో కూలీలు–రైతులు– కార్మికులను సంఘటితం చేసి,భూస్వామ్య పెత్తందారి గడీలను బ్రద్దలు కొట్టి, పాలక నిజం చేనుడను రజాకార్లను తరిమి కొట్టిందన్నారు.వీర తెలంగాణ పోరాట ఫలితంగా ఆనాటి పేదలు–బడుగులకు 10 లక్షల ఎకరాల భూమిని పంచి పెట్టడంలో కీలక భాగస్వామి– సామ్యవాద ఉద్యమ నేత ఐలమ్మంటూ కొనియాడారు. బలహీన వర్గాలకు చెందిన నిరుపేద రజక కుటుంబంలో పుట్టి,ఆనాటి సామాజిక సమానతలు–పాలక రజాకార్ల దౌర్జన్యాలకు ముఖ్యంగా దొరల పీడన–దోపిడీలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ పోరాడిందన్నారు. కూలి రేట్లు పెంచాలని–దున్నేవాడికే భూమంటూ–శ్రామిక వర్గ రాజ్యం కోసం ఐలమ్మ తన వీరోచిత పోరాటాలను ప్రపంచానికి చాటిన నిప్పు కణికన్నారు.రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ,ఐలమ్మ భూస్వామ్య దోపిడీదారుల్ని–పాలక రాక్షస రజాకార్ మూకల్ని తన పోరాటంతో తరిమి కొట్టిందన్నారు. పేదలు–బడుగులైన శ్రామిక వర్గ ప్రజలను చైతన్యపరిచి,తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా లక్షలాది ఎకరాల భూములు పంచడానికి కారణమైందన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని అణగారిన వర్గాలు ముఖ్యంగా యువత అందిపుచ్చుకొని, హక్కుల సాధన కోసం–రాజ్యాంగబద్ధ రక్షణల కోసం పోరాడాలన్నారు. అంతిమంగా సమతా మమతలతో నిండిన సమ సమాజ స్థాపన కోసం మనందరం ఐక్యంగా పోరాడటమే అయిలమ్మకు సమర్పించే నిజమైన– ఘనమైన నివాళులు అంటూ మహేష్ అన్నారు. ఇంకా ఈ జయంతి వేడుకలలో రాష్ట్ర నాయకులు కేసన కోటేశ్వరరావు, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు జంజనం వరప్రసాద్, మంగళగిరి నగర మహిళా అధ్యక్షురాలు జి జయలక్ష్మి, బీసీ స్టడీ సర్కిల్ రాష్ట్ర అధ్యక్షులు వై. వెంకటేశ్వరరావు, బీసీ స్టడీ సర్కిల్ ఉద్యోగులు వై రామకృష్ణ,సూరిబాబు, శ్యామ్, శ్రీనివాస్, రమేష్, పి.పురుషోత్తం, ఓ. రామకృష్ణ,చిరంజీవి,ప్రసాద్,అశోక్,బి. సురేష్,మంగళగిరి నగర నాయకులు జాకీర్ హుస్సేన్ మంగళగిరి నగర నాయకులు జాకీర్ హుస్సేన్,కే.ధనుంజయరావు,కే ధనుంజయరావు, దానా గౌడ్, పలువురు బీసీ నాయకులు–కుల సంఘ నాయకులు పాల్గొని ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

# ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ పాలసిలోని లోపాలను సవరించాలి.

### గత జగన్ ప్రభుత్వం యాజమాన్యాలను బ్లాక్ మెయిల్ చేసిందుకే జీవోలు తెచ్చింది.

### మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్.



సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు (ఎం.ఎస్.ఎం.ఈ) పాలసీలోని లోపాలను సవరించాలని, గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పరిశ్రమల యాజమాన్యాలను చెప్పు చేతల్లో పెట్టుకుని బ్లాక్మెయిల్ చేసేందుకు కొన్ని జీవోలను చేసిందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్మెంట్ పాలసీపై ఉపాధి అవకాశాలు, పరిశ్రమల గురించిన లఘు చర్చలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం మాట్లాడారు. వన్ ఎంటర్ ప్రెన్యూర్ వన్ పాలసీలోని పలు లోపాలను ఆయన ప్రస్తావించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'వన్ ఎంటర్ ప్రెన్యూర్ వన్ పాలసీ, జీవో నెంబరు 69లో కొన్ని లోపాలు ఉన్నాయి. ఎం.ఎస్.ఎం.ఈలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే టెండర్లలో లోకల్ ప్రొక్యూర్ మెంట్ కింద 25 శాతం పర్చేజ్ ప్రిఫరెన్స్ ఇస్తున్నారు. కానీ దీనివల్ల వారికి ఉపయోగం ఏమి లేదు. ఎందుకంటే పెద్ద సంస్థలు టెండర్లలో పాల్గొన్నప్పుడు ఎం.ఎస్.ఎం.ఈలు పోటీ పడగలిగే పరిస్థితి ఉండదు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు 25 శాతం ప్రొక్యూర్ మెంట్ స్థానిక ఎం.ఎస్.ఎం.ఈలకు ఇవ్వాలి. అలాగే ఎల్ 1 ఎవరైతే ఉన్నారో వారికంటే ప్రైస్ లో 15 శాతం లోకల్ గా ఉన్న ఎం.ఎస్.ఎం.ఈలకు తగ్గించి ఇవ్వాలి. ఎం.ఎస్.ఎం.ఈలకు స్థానికంగా ఉన్న వారికి ప్రైస్ కూడా ప్రాధాన్యత ఇచ్చి, రిబేటు ఇవ్వాలి. దీనివల్ల స్థానికంగా పరిశ్రమలు పెరిగి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

### గత ప్రభుత్వ జీవోలో సవరణ అవశ్యం.

స్థానికులకు పరిశ్రమల్లో 75% ఉద్యోగాలు ఇవ్వాలని, 25 శాతం బయట రాష్ట్రాల వారిని తీసుకోవాలని గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో ఇచ్చింది. స్థానికంగా కార్మికుల లభ్యత ఉంటే బయట నుంచి ఉద్యోగులను తెచ్చుకోవాలని ఏ యాజమాన్యం కోరుకోదు. కేవలం పరిశ్రమల యాజమాన్యాలను చెప్పు చేతుల్లో పెట్టుకొని, బ్లాక్ మెయిల్ చేసేందుకు అప్పట్లో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగా ఈ జీవో ఇచ్చింది. ఈ నిబంధన కింద గత ప్రభుత్వం హయంలో కూడా ఎక్కడ ఒక కేసు కూడా నమోదు కాలేదు. దీనివల్ల అధికారులు పరిశ్రమలపై బ్లాక్ మెయిల్ చేసేందుకు అవకాశం ఉంది. దయచేసి ఈ నిబంధన తొలగించాలి.నూతన ఇండస్ట్రియల్ పాలసీలో గైడెన్స్ లో స్పష్టత లేని కారణంగా జిల్లా స్థాయిలో నిర్వహించాల్సిన సమావేశాలు నిలిచిపోయాయి. ఎస్.ఎల్.సిలు కూడా సమావేశాలు జరగడం లేదు. వీటన్నింటినీ సరిదిద్దుకోవాలి. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. ఇదే కర్తవ్య దీక్షతో ఏపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ లక్ష్యాలు సాధించాలంటే స్థానికంగా ఉన్నటువంటి ఎం.ఎస్.ఎం.ఈలను ప్రోత్సహించాలి. వీరికి కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 25 శాతం ప్రాధాన్యత ఇచ్చి, రేటులో కూడా ఎల్ 1 కంటే 15 శాతం తగ్గించి ఇవ్వాలి. తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలి.' అని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

# గుంటూరు జిల్లా బిజెపి కార్యాలయంలో మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు

**గుంటూరు సెప్టెంబర్ 26(లక్ష్యం న్యూస్)::**




భార భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ సయ్యద్ బాషా గారు రాష్ట్ర పర్యటనలో భాగంగా గుంటూరు జిల్లా బిజెపి కార్యాలయానికి చేయటం జరిగింది. వారు విచ్చేసిన సందర్భంగా జిల్లాలో మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సమావేశానికి మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సాంబశివరావు మరియు హేమంత్ సోలంకి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షులు సయ్యద్ భాష గారు మాట్లాడుతూ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఈరోజు జిల్లా పర్యటన రావడం జరిగింది. ఎంతో ఆత్మీయంగా నా మైనార్టీ మోర్చా నాయకులు నన్ను సాధారణంగా ఆహ్వానించడం జరిగింది. రాబోయే రోజుల్లో మైనార్టీ మోర్చాని ఈ జిల్లాలో బలోపేతం చేయడం కోసం కృషి చేయడం జరుగుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోడీ గారు మైనార్టీ వారి కోసం అనేక సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకువచ్చారు ఆ పథకాలన్నీ మైనార్టీ వారికి ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల వారికి అందే విధంగా మనమందరం కృషి చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ మన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసే విధంగా అలాగే మనం కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నాము అలాగే ఈ కూటమి పథకాలు ఏదైతే ఉన్నాయో ఇవన్నీ కూడా అట్టడుగు వర్గాలకు అందే విధంగా మనందరం కృషిచేసి తద్వారా వారిని బలోపేతం చేస్తూ మన మైనార్టీ మోర్చాని ముందుకు తీసుకువెళ్లి ఈ జిల్లాలో మన మైనార్టీ నాయకుల్ని ఎక్కువమందిని తయారు చేసే విధంగా అందరికీ అందుబాటులో ఉంటానని తెలియజేశారు. జిల్లా అధ్యక్షులు చెరుకు తిరుపతిరావు గారు మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీన్ మాధవ్ గారు బాధ్యతలు తీసుకున్న తర్వాత భారతీయ జనతా పార్టీలో అనేక కార్యక్రమాలను తీసుకుంటూ ముందుకు వెళ్తున్నారని వారు తీసుకున్న ప్రతి కార్యక్రమం సక్సెస్ అవుతుందని వారి ఆధ్వర్యంలోనే జిల్లా కార్యక్రమాలు కూడా సక్సెస్ అవుతున్నాయని భవిష్యత్తులో జిల్లా పార్టీకి ధీటుగా మైనార్టీ మోర్చా బలోపేతం చేయాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ కుద్దూస్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ షేక్ రఫీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌస్ పీరా, మైనారిటీ నాయకులు షేక్ మహబూబ్ , డి హుస్సేన్ ,షేక్ మౌలాలి ,షేక్ ఫరహానా , షేక్ బిలాల్ పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్ , జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ గారు, చరక కుమార్ గౌడ్ , కొక్కెర శ్రీనివాస్ యాదవ్ , కొర్ర శ్రీనివాస్ నాయక్,మండల అధ్యక్షులు తంగా లక్ష్మణ్ రావు,నాయకులు తాడువాయు రామకృష్ణ, తాను చింతల అనిల్, రాజేష్ నాయుడు, టీవీ రమణ,తదితరులు పాల్గొన్నారు

# దేవీ నవరాత్రులు

## దసరా ఉత్సవాలు

కనకదుర్గమ్మ అమ్మవారి రోజు వారీ అలంకరణలో భాగంగా, రోజుకో రంగు దుస్తుల్లో అసెంబ్లీకి వెళ్లాలనే నిర్ణయం మేరకు.. ఈరోజు అమ్మవారికి శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారం సందర్భంగా మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలసి ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించి అసెంబ్లీకి హాజరైన ప్రభుత్వవిప్,నందిగామ ఎం ఎల్ ఏ తంగిరాల సౌమ్య,రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత.



# దసరా మహోత్సవాలులో

# స్కందమాత అలంకారంశేషవాహనసేవలో స్వామి అమ్మవారు

**శ్రీశైలం లక్ష్యం న్యూస్:**
దసరా మహోత్సవాలలో భాగంగా అయిదవ రోజైన శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రాత:కాల పూజలు, విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్య నమస్కారములు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానములు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారీపూజలు జరిపించబడ్డాయి. అదేవిధంగా రుద్రహోమం, రుద్రయాగాంగ జపములు, రుద్ర పారాయణలు జరిపించబడ్డాయి. అదేవిధంగా ఈ సాయంకాలం జపములు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన, చండీ హోమం జరిపించబడుతాయి. రాత్రి 9.00గంటల నుండి కాళరాత్రిపూజ, అమ్మవారి ఆస్థాన సేవ, సువాసినీ పూజలు వంటి ప్రత్యేక పూజలు జరిగాయి

## స్కందమాత అలంకారం:-

మహోత్సవాలలో చేయబడుతున్న నవదుర్గ అలంకారాలలో భాగంగా ఈ నవరాత్రి శ్రీ అమ్మవారి ఉత్సవమూర్తిని స్కందమాత స్వరూపంలో అలంకరింపజేయడం జరిగింది. . నవదుర్గలలో ఐదవరూపమైన ఈ దేవి చతుర్భుజాలను కలిగిఉండి, ఒక చేతిలో స్కందుణ్ణి పట్టుకుని ఉండి, మిగిలిన చేతులలో పద్మాలను, అభయముద్రలను ధరించి ఉంటుంది. ఈమె ఒడిలో బాలుని రూపంలో స్కందుడు (కుమారస్వామి) కూర్చొని ఉంటాడు. స్కందదేవుని జనని కావడం వలన ఈ దుర్గాస్వరూపం స్కందమాతగా ప్రసిద్ధి చెందింది. ఈ స్కందమాతను ఉపాసించడం వల్ల స్కందదేవుని కూడా ఉపాసన చేసిన ఫలితం లభిస్తుందని చెబుతారు. ఈ దేవిని ఆరాధించడం వలన సకల కోర్కెలు నెరవేరడమే కాకుండా శాంతి సౌఖ్యాలు లభిస్తాయి.

## శేషవాహనసేవజి

ఈ ఉత్సవాలలో శ్రీస్వామిఅమ్మవార్లకు నిర్వహిస్తున్న వాహనసేవలలో భాగంగా శేషవాహనసేవ జరిపించబడుతుంది. ఈ వాహనసేవలో శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేసి, శేష వాహనంపై వేంచేబు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించబడ్డాయి. .

## సాంస్కృతిక కార్యక్రమాలు:-

ఈ మహోత్సవముల సందర్భంగా భక్తులను అలరించేందుకు ప్రతీరోజు సాయంత్రం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయబడ్డాయి నిత్య కళారాధన వేదిక సాయంత్రం గం. 6.00ల నుంచి టి.ఎ. విశాలాక్షి బృందం వారిచే రాత్రి 8.00 గంటల వరకు 2 రాత్రి గం. 8.00 ల నుంచి బృందం, సికింద్రాబాద్ వారిచే విభూది లోవరాజు మరియు వారి బృందం, రాజమండ్రి వారిచే గాత్ర కచ్చేరి పార్వతీ కల్యాణం ఒంటి కార్యక్రమాలు భక్తుల కోసం ఏర్పాటు చేయడం జరిగినది.

# మహాలక్ష్మి అలంకృత అమ్మవారిని దర్శించుకున్న గవర్నర్

**ఇంద్రకీలాద్రి,లక్ష్యం న్యూస్**
గౌరవనీయులైన గవర్నర్ ఏపీ ఆంధ్రప్రదేశ్ శ్రీ అబ్దుల్ నజీర్ ఈరోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాదేవి మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు గవర్నర్ కీ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఆలయానికి విచ్చేసిన గవర్నర్ ఆలయ ప్రధాన ద్వారం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ హరి జవహర్‌లాల్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ రామచంద్ర మోహన్, దేవాలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనా నాయక్ లు పాల్గొన్నారు. ఆలయ మర్యాదలతో గవర్నర్‌ను ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం, శ్రీ గవర్నర్ శ్రీ అమ్మవారి దర్శనం చేసుకున్నారు. వేద పండితులు గవర్నర్ కి వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయ అధికారులు గవర్నర్ కి అమ్మవారి చిత్రపటం , ప్రసాదాలను అందజేశారు.శ్రీయుత గవర్నర్ గారికి పర్యటన అనంతరం,






ముఖ్య కార్యదర్శి హరి జవహర్‌లాల్ ఆలయ అధికారులు మరియు సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లు, కల్పించాల్సిన సౌకర్యాల గురించి వాకాబు చేశారు. దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ రామచంద్ర మోహన్ కూడా ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై వివరణ ఇచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈఓ వి.కె. శీనా నాయక్ భక్తులకు అందిస్తున్న

# కాణిపాకం దేవస్థానం నుంచి అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పణ



**ఇంద్రకీలాద్రి,లక్ష్యం న్యూస్**
దసరా నవరాత్రులలో ఐదవ రోజు శ్రీ మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారికి కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం తరపున పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో ఒకసారి, దసరా నవరాత్రులలో మరొకసారి .. ఇలా రెండు పర్యాయాలు అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించే సంప్రదాయం ఉన్నట్లు చెప్పారు. కాణిపాకం దేవస్థాన కార్యనిర్వహణాధికారి పెంచల కిషోర్, స్థానాచార్యులు ఫణీంద్ర స్వామితో కలసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించినట్లు చెప్పారు. ఒక ఆలయం నుంచి మరొక ఆలయానికి పట్టు వస్త్రాలు సమర్పించే ఈ సత్సాంప్రదాయం కొనసాగాలని చెప్పారు. ఇంద్రకీలాద్రి జనసంద్రంగా మారినా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్న అధికార యంత్రాంగాన్ని అభినందించారు. కాణిపాక దేవస్థానం నుంచి అమ్మవారికి



అమ్మవారికి సారు సమర్పించిన కాణిపాక దేవస్థానం కార్యనిర్వాహన అధికారి శాసనసభ్యులు

సరే తెచ్చిన శాసనసభ్యులు మురళీమోహన్, కాణిపాక కార్యనిర్వహణ అధికారి పెంచల కిషోర్ కు అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వారికి అమ్మవారి దర్శనం కల్పించి తదానంతరం వేద ఆశీర్వచనం చేయించి వారికి అమ్మవారి తీర్థ ప్రసాదము అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

# శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా

## దర్శనము ఇవ్వనున్న కనకదుర్గమ్మ



**ఇంద్రకీలాద్రి,,లక్ష్యం న్యూస్**
శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆరవ రోజు శ్రీ కనకదుర్గ అమ్మవారు లలిత త్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తారు.ఈ అమ్మవారు శ్రీ చక్రఅదిష్టాన శక్తిగా పంచదశాక్షరీ మహా మంత్రాధి దేవతగా వేంచేసి ఆరాధించ భక్తులకు ఉపాసకులను అనుగ్రహిస్తుంది. శ్రీ లక్ష్మీదేవి సరస్వతి దేవి ఇరువైపులా వింజమరలతో సేవిస్తూ ఉండగా చిరు మందహాసంతో వాత్సల్యరుపినిగా చెరుకు గడును చేత పట్టుకొని మహా కామేశ్వరాంకయే శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చే సమయంలో పరమేశ్వరుడు మహంకాళేశ్వరుడు గా శ్రీ అమ్మవారు మహాత్రిపుర సుందరి దేవిగా పూజలు అందుకుంటారు. శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిని పూజించే భక్తులు ఆమెకు పులిహోర, చక్కెర పొంగలి, పరమాన్నం, పెసర బూరెలు అమ్మకు నివేదనగా సమర్పిస్తారు. లలిత త్రిపుర సుందరీ దేవికి బంగారుపు వర్ణపు వస్త్రాలను అలంకరింప చేస్తారు. అమ్మకు ఎంతో ప్రీతమైన ఎర్రని కలువులతోనూ ఎర్రని గులాబీలతోనూ పూజలు చేస్తే అమ్మ భక్తులను కటాక్షిస్తుంది .

# అఖండ ఆన్ ఫైర్

**విజయవాడ, సెప్టెంబర్ 26,లక్ష్యం న్యూస్**
హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఏదో కొంత ఫ్రస్టేషన్ లో ఉన్నట్లు కనిపిస్తుంది. ఆయన సినీ ఇండ్రస్ట్రీలో తనకంటే జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు ఎక్కువ ప్రాధాన్యత లభిస్తుందని ఆయన కొంత అసహనం వ్యక్తం చేస్తున్నట్లు అనిపిస్తుంది. ఎందుకంటే నందమూరి బాలకృష్ణ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం చాలా తక్కువ. ఆయనకు రాజకీయాలకంటే సినిమాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అయితే గత కొద్ది రోజుల నుంచి నందమూరి బాలకృష్ణ శాసనసభ సమావేశాలకు హాజరవుతున్నారు. ఆయనలో ఉన్న కోపాన్ని సమావేశాల్లో వెళ్లగక్కారు. తనలో దాచిపెట్టుకున్న అసహనాన్ని సభలో వెళ్లగక్కేందుకు బాలకృష్ణ ఏమాత్రం వెనకాడ లేదు. నిజానికి నందమూరి బాలకృష్ణ ఏదున్నాసూటిగా మాట్లాడతారంటారు. ఆయన అభిమానుల విషయంలోనూ అదే రేంజ్ లో తన అభిమానాన్ని కానీ, తన అసహనాన్నివ్యక్తం చేస్తారు. కొన్నిసార్లు అభిమానులపై చేయి చేసుకుని వివాదలో చిక్కుకున్నారు. అలాంటి నందమూరి బాలకృష్ణ ఈరోజు అసెంబ్లీ సమావేశాల్లో చిరంజీవి, జగన్ పై తీవ్ర వ్యాఖ్యలుచేయడం కూడా అదే కారణమని తెలుగుదేశం పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. అందుకే జనసేనకు చెందిన మంత్రి కందుల దుర్గేష్ పై కూడా ఆయన మండిపడ్డారు. అలాగే కామినేని శ్రీనివాస్ తీరుపై కూడా నందమూరి బాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు కారణాలు కూడా ఉన్నాయి. నందమూరి బాలకృష్ణ రాజకీయంగా ఎలాంటి పదవి కోరుకోరు. కానీ తనకు ప్రాధాన్యత కోరుకోవడంలో మాత్రం ముందుంటారు.అదే ఈరోజు జరిగింది. శాంతి భద్రతల విషయంలో అసెంబ్లీలో జరిగిన చర్చలో కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి జగన్ ను సినీ ప్రముఖులు కలిసేందుకు వచ్చారని, అయితే అప్పుడు జగన్ అపాయింట్ మెంట్ ఇవ్వకపోవడంతో ఇంటికి వచ్చిన సినీ ప్రముఖులు నాటి సినీ ఫొటోగ్రఫీ మంత్రి పేర్ని నానికి చెప్పారు. తర్వాత తాను ఇంతమందిని తీసుకు వస్తే ఎందుకు ఆయన కలవడం లేదని గట్టిగా అడిగిన తర్వాత జగన్ అపాయింట్ మెంట్ ఇచ్చారని కామినేని శ్రీనివాస్ తఅన్నారు. దీనికి నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ కామినేనిశ్రీనివాస్ అసెంబ్లీలో అబద్ధాలు చెబుతున్నారన్నారు. చిరంజీవి గట్టిగా మాట్లాడితే నాడు సైకో జగన్ అపాయింట్ మెంట్ ఇచ్చారనడం అబద్ధమని తెలిపారు. చిరంజీవి కాదు గదా ఎవరూ అడగలేదని నందమూరి బాలకృష్ణ గట్టిగా అన్నారు. చుక్కలు చూపిస్తున్నారుగా తొమ్మిదో ప్లేస్ లోనా? అలాగే ఫిలిం డెవలెప్ మెంట్ కోసం జాబితాను తయారు చేయాలని తనకు ఒక ఆహ్వాన పత్రం వచ్చిందని, అందులో తన పేరును తొమ్మిదో సంఖ్యలో ఉందని నందమూరి బాలకృష్ణ అన్నారు. నా పేరును తొమ్మిదో ప్లేస్ లో చేర్చిందెవరు? మమ్మల్ని గౌరవించరా? అంటూ ప్రస్తుత టూరిజం సినిమా టోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ను నేరుగా సభలో ప్రశ్నించారు. బాలయ్య సభలో ఇలా వ్యవహరించడానికి తనలో ఇన్నాళ్లు దాచుకున్న బాధను అసెంబ్లీలో వెళ్లగక్కారన్నారు. తాను పవన్ కల్యాణ్ కంటే రాజకీయంగా, సినీరంగలో సీనియర్ నని నందమూరి బాలకృష్ణ చెప్పీ చెప్పకుండానే సభలో ఉన్న అందరికీ చెప్పే ప్రయత్నం చేశారని సభలో ఉన్న ఎమ్మెల్యేలు చర్చించుకుంటును?నారు.

# జోరు వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం



జమ్మలమడక బ్రిడ్జి పై నుండి పారుతున్న చంద్రవంక

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :**
శుక్రవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో మాచర్ల పరిసర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు శుక్ర,శని వారాల్లో కురిసిన వర్షంతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఇప్పటికే మాచర్ల పెద్ద చెరువు నిండి అలుగుపారుతుంది. 13వ వార్డు, సుద్దగుంతల ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై పారుతుంది. దాంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జమ్మలమక బ్రిడ్జిపై నుండి చంద్రవంక వాగు ప్రమాదకరంగా పారుతుంది. దాంతో రాకపోకలు నిలిచిపోయాయి. అటువైపు ఎవరూ పోకుండా పోలీసులు, రెవిన్యూ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. జమ్మలమడక, లింగాపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అజాద్ నగర్ కు వెళ్ళే బ్రిడ్జి పై నుండి కుడా చంద్రవంక వాగు ఉధృతంగా పారుతుంది. వర్షాకాలలో తరుచూ చంద్రవంక పొంగిపొర్లి పారుతుండటంతో రాకపోకలకు అటంకం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా బ్రిడ్జిలు ఎత్తు పెంచి, హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

# శ్రీ సంతానలక్ష్మీదేవిగా దర్శనం ఇచ్చిన వాసవీమాత



సంతానలక్ష్మీదేవి అవతారంలో వాసవీమాత

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :**
స్థానిక శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని శుక్రవారంనాడు శ్రీ సంతానలక్ష్మీదేవిగా అలంకరణ గావించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ వాసవీ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, పలువురు దంపతులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. శ్రీషిర్డిసాయిబాబావారి ఆలయంలో అమ్మవారిని శ్రీ లలితాదేవిగా అలంకరణ గావించారు. శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి దేవాలయంలో అమ్మవారిని శ్రీ లక్ష్మీదేవిగా అలంకరణ గావించారు. శ్రీ కోదండ రామాలయంలో మహిళలు బతకమ్మలను ఏర్పాటు చేసి ఆట, పాటలతో ఆలరించారు. పలు వీధులలో మహిళలు రహదారి పైన బతకమ్మలను ఏర్పాటు చేసి ఆట, పాటలతో ఉత్సవాలను నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ, తీర్థ ప్రసాదాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అమ్మవారి దేవాలయంలో పూజ కార్యక్రమాలను అమ్మవారి అలంకరణను అర్చకులు బత్తెనపాటి శ్రీనివాసశర్మ, వాసవీదత్తు, కొండవీటి రాఘవాచార్యులు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ వాసవీ అమ్మవారి దేవస్థాన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు భవనాశి వెంకటేశ్వర్లు, సన్నిధి హనుమంతురావు, సభ్యులు కూనిశెట్టి చినవెంకటేశ్వర్లు, గుండా వెంకటమల్లికార్జునరావు, తుమ్మేపల్లి అంకేశ్వరరావు, చిన్ని చంద్రశేఖరరావు, కొత్త శ్రీదేవి, పరిటాల ధనలక్ష్మీ, మేడా వెంకటలక్ష్మి, చిన్ని ఆదిలక్ష్మి, కొత్తమాసు వీరాంజనేయులు, భాస్కరరావు, రాచమడుగు వెంకటేశ్వర్లు, చిన్ని సత్యనారాయణ, విడేల సుందరరావు, చిల్లంచర్ల సత్యనారాయణ, భవనారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొని ఉత్సవాలను పర్యవేక్షించారు.

# 27న జరిగే మెగా జాబ్ వేళాను సద్వినియోగం చేసుకోండి

ఫోటోరైటప్ : 26 ఎంసిఎల్ 03:



**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :**
స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న స్థానిక శ్రీకాసుబ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ కళాశాల నందు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడిరచారు. టాప్ మల్టీ నేషన్ కంపెనీలతో నిర్వహించే ఈ జాబ్ మేళలో పెద్దఎత్తున నిరుద్యోగ యువత పాల్గొని, ఉద్యోగాలు సాధించాలని ఆయన కోరారు. ప్రస్తుతం ఆన్ లైన్, ఆఫ్ లైన్ రిజిస్ట్రేషన్లు మొదలయ్యాయని, యువత తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. మరిన్నీ వివరాలకు ఫోన్ నెంబర్లు 77027 00990, 94921 58153 లకు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# అక్టోబర్ 2 వరకు లోన్ మేళా

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :**
మాచర్ల పురపాలక సంఘ పరిధిలోని లోక కళ్యాణ మేళలో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వీధి వ్యాపారుల లోన్ మేళా కార్యక్రమం జరిగింది. వీధి వ్యాపారులకు అందుబాటులో ఉన్న రుణ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచర్ల పురపాలక కమిషనర్ డి. వేణు బాబు పాల్గొని మాట్లాడుతూ అక్టోబర్ 2 వరకు లోన్ మేళా నిర్వహించబడుతుందని చెప్పారు. చిరు వ్యాపారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు మేనేజర్లు, సీఓలు పాల్గొని వీధి వ్యాపారులకు రుణ పథకాలు, అర్హత ప్రమాణాలు, మరియు వడ్డీ రహిత సౌకర్యాలపై వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలోని అన్ని వీధి వ్యాపారులు పాల్గొన్నారు.
ఫోటో రైటప్:

# రెడ్ క్రాస్ ను బలపరుద్దాం సేవలు అందిద్దాం.



రెడ్ క్రాస్ ఆఫ్రాన్లను అందిస్తున్న ధనుంజయ రావు.

**కర్లపాలెం సెప్టెంబర్ 26 లక్ష్యం న్యూస్.**
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని బలపరుద్దాం దాని సేవలను ఆపదలో ఉన్నవారికి అందిద్దాం అని కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీస్ రావు అన్నారు. శుక్రవారం స్థానిక కర్లపాలెం రెడ్ క్రాస్ కార్యాలయం నందు రెడ్ క్రాస్ సభ్యులకు రెడ్ క్రాస్ ఆఫ్రాన్లను(రెడ్ క్రాస్ యూనిఫామ్) పేరలి ధనుంజయ రావు సభ్యులకు ఉచితముగా అందించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత హి లో భాగంగా రెడ్ క్రాస్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా పోలీసు రావు మాట్లాడుతూ రెడ్ క్రాస్ జీవిత సభ్యత్వం 1100 చెల్లించి సభ్యులుగా చేరవచ్చని వారికి ఐడి కార్డు పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో , సభ్యులు ధనుంజయరావు, కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and owned by CHALLA MADHUSUDHANA RAO,and Printed at VEERENDRA GRAPHICSD.NO.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001. Guntur Dist, A.P. and Published at D.No.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001, Guntur Dist, A.P. R.N.I. No. APTEL/2013/48712 Editor : CHALLA MADHUSUDHANA RAO